## 28న ఉట్లోత్సవం



తిరుమల, ఆగస్ట్ 20ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి చెంత గోకులాష్టమి ఆస్థానం ఈనెల 27వతేదీ మంగళవారం కన్నుల పండువగా జరగనుంది. శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం, మరుసటి రోజు ఉట్లోత్సవం అత్యంత వేడుకగా జరిపిస్తారు. ఆలయ నాలుగుమాఢవీధుల్లో ఉట్లను ఏర్పాటుచేస్తారు. యువకులు ఎంతో ఉత్సాహంతో 28వతేదీ బుధవారం సాయంత్రంఉట్లను కొడుతూ స్వామికి ఆనందం కలిగిస్తారు.




## బ్రహ్మోత్సవాలకు కలెక్టర్‌ను ఆహ్వానించిన ఇఓ



చిత్తూరు, ఆగస్టు 20 ప్రభాతవార్త: శ్రీ వరసిద్ధి కాణిపాక వినాయకస్వామి ఆయల వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆలయ ఇఓ వాణి కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను మంగళవారం ఆహ్వానించారు. కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్‌లో మంగళవారం కాణిపాకం ఆలయ ఇఓ వాణి కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి ఈ నెల 27వ తేదీన కాణిపాకంలో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ సమావేశానికి హాజరై అధికారులకు దిశా నిర్దేశం చేయాలని కలెక్టర్‌ను ఇఓ కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కాణిపాకం ఆలయ అర్చకులు ఆశీర్వాదం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటంను అందజేశారు.

### అనధికార హాకర్లను

# కట్టడిచేస్తారా!?

### -వ్యాపారాల్లో తేడాలొస్తే దాడులు



ప్రభాతవార్తప్రతినిధి–తిరుమల: వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి తమ కష్టాలు చెప్పుకుని మొక్కులు తీర్చుకుందామని వచ్చే భక్తులకు హాకర్ల దోపిడీ ఎక్కువైంది. ఎంతో భక్తిభావంతో...పవిత్రమైన మనసుతో తిరుమలకు చేరుకున్న భక్తులను అక్కడా ఇక్కడా అని గాకుండా కొండపై కాలుమోపగానే వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌ల నుండి స్వామివారి దర్శనం చేసుకుని వెలుపలకు వచ్చిన తరువాత ఆలయం పరిసరాల్లో హాకర్లు పలురకాలుగా వెంటపడి ఇబ్బందులు పెడుతున్నారు. కొండపై అనధికార హాకర్లు తమ ఇష్టారాజ్యంగా తయారై వ్యాపారాలు చేసుకునే సమయంలో భక్తుల ముందే వివాదాలు తలెత్తి గొడవలకు దిగుతున్నారు. శనివారం తిరుమలలోని నందకం ప్రాంతంలో శ్రీకాంత్, శ్రీనివాస్ ఇద్దరు హాకర్లు భక్తులకు పలు వస్తువులు విక్రయించే సమయంలో ఇద్దరి మధ్య వ్యాపారం తగాదాతో గొడవ జరిగి, గాజు సీసాలతో దాడి చేసుకున్నారు. ఇద్దరూ రుయాలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ఇలా తరచూ ఆలయం ముందు, ఆస్థానమండపం, మాఢవీధుల్లో, షాపింగ్ కాంప్లెక్స్, అన్నదానం భవనం, నందకం వద్ద హాకర్లు గొడవలు చేసుకోవడం సాధారణమైంది. గత ఐదేళ్ళలో హాకర్లు ఎక్కువై వ్యాపారాల్లో గొడవలకు దిగి హత్యాయత్నాలకు పాల్పడిన ఘటనలు జరిగాయి. ఏకంగా సిఆర్ఒ, షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో కూడా హాకర్లు ఘర్షణలు చోటుచేసుకున్నాయి. గత ఏడాది ఏకంగా ఆలయ ఉత్తరమాఢవీధిలో ఇద్దరు హాకర్లు గొడవకు దిగిన ఉదంతం తెలిసిందే. ఇలా హాకర్లను కట్టడిచేయడంలో టిటిడి విజిలెన్స్‌గానీ, పోలీసులు గానీ సాహసం చేయడం లేదంటే రాజకీయ ఒత్తిళ్ళు భయంతోనేననేది వాస్తవం. హాకర్లను, అనధికార హాకర్లను కట్టడిచేయాలని ఇప్పటికే టిడిపి నేతలు టిటిడి ఈఓకు ఫిర్యాదు చేశారు. తిరుమల పవిత్ర పుణ్యక్షేత్రానికి ప్రతిరోజూ లక్షమంది వరకు భక్తులు వస్తున్నారు. ఇలా వస్తున్నవారిలో సర్వదర్శనం భక్తులు 40వేలమందివరకు ఉంటున్నారు. ఆన్‌లైన్‌లో ప్రత్యేక ప్రవేశ దర్శనాల టిక్కెట్లు కలిగిన భక్తులు 25వేలమంది వరకు ఉంటారు. వీళ్ళు నేరుగా వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ వద్దకు చేరుకుంటే సాంప్రదాయ దుస్తులు ధరించకపోతే అక్కడికక్కడే పంచలు విక్రయాలు అధికార లైసెన్స్ ఉన్న వ్యాపారులే చేయాలి. అయితే కొందరు బినామీ పేర్లతో ఈ వ్యాపారాలు చేస్తూ భక్తులను అధిక ధరకు దోపిడీకి గురిచేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఇలా ఒక్కో హాకర్ రోజుకు మూడువేల రూపాయల వరకు ఆర్జిస్తున్నట్లు అంచనా. ఇక ఆలయం నుండి వెలుపలకు వచ్చిన భక్తులను ఆలయానికి ఎదురుగా ఉన్న బేడి ఆంజనేయస్వామికి చేరుకునే మార్గంలో ఫోటోలతో పేరుతో అనధికార హాకర్లు, కర్పూరం, నెయ్యి ఒత్తులు, దూపందీపం అంటూ అనధికారికంగా వ్యాపారాలు చేస్తున్నారు. ఈ తతంగం అంతా విజిలెన్స్, పోలీసులకు తెలిసినా చూసీచూడనట్లు పోతున్నారనే విమర్శలు ఎక్కువగా ఉన్నాయి. ఇక ఎవరైనా ఉన్నతాధికారులు టిటిడి ఇఒ, జెఇఒ, సివిఎస్ఓ, విఎస్ఓ అధికారులు మెరుపు దాడులు, సుడిగాలి పర్యటనలకు వచ్చే ముందు కొందరు విజిలెన్స్ సిబ్బంది హాకర్లను ముందుగానే హెచ్చరించి తరిమేస్తున్నారు. మిగిలిన సమయాల్లో యధేచ్ఛగా వారి వ్యాపారాలు మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగిస్తున్నారు. అనధికార హాకర్లు, హాకర్ల అక్రమ వ్యాపారాలపై నిఘా ఉంచి కొరఢా ఝుళిపిస్తే తప్ప దాడులకు అడ్డుకట్టపడదు.

# డెంగ్యూ పరేషాన్



### - జ్వరాల కట్టడికి వైద్య ఆరోగ్యశాఖ విఫలయత్నం

చిత్తూరు, ఆగస్టు 20 ప్రభాతవార్త: గ్రామీణ ప్రాంతాల్లో డెంగ్యూ జ్వరాలు ప్రబలుతుండటంతో ప్రజల్లో పరేషాన్ నెలకొంది. డెంగ్యూ జ్వరాల బారిన పడుతున్న వారిలో చిన్న పిల్లలు అత్యధికులు వుండటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. డెంగ్యూ జ్వరం సోకిన వారికి ప్లేట్‌లేట్లు పడిపోతుండటంతో ఖరీదైన చికిత్స చేయడం కోసం డెంగ్యూ జ్వర బాధితుల తల్లిదండ్రులు అల్లాడిపోతున్నారు. జిల్లాలో ఈ ఏడాది జూన్ నెల నుండి వర్షాకాలం ప్రారంభం కాడడంతో పల్లె ప్రాంతాల్లో వర్షాలకు కురిసిన నీరు ఎక్కడ పడితే అక్కడ నిల్వ వుండటంతో దోమల ఉత్పత్తికి అవకాశం ఏర్పడుతుంది. పట్టణ, పల్లె ప్రాంతాల్లో దోమల ఉత్పత్తిని కట్టడి చేయడానికి మున్సిపాల్టీలు, గ్రామ పంచాయతీలు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది చేస్తున్న ప్రయత్నాలు ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. ఒక ప్రాంతంలో నాలుగు రోజుల పాటు నీటిలో కదలిక లేకుండా నిల్వ వుండిపోతే ఆ నీటి నుండి దోమలు ఉత్పత్తి అవుతున్నాయి. ఇలా ఉత్పత్తి అయిన దోమలు ప్రజలను కాటు వేస్తుండటంతో వారు మలేరియా, డెంగ్యూ, చికన్ గున్యా తదితర జ్వరాల బారినపడుతున్నారు. నివాస ప్రాంతాల్లో మంచినీటి నిల్వలో ఉత్పత్తి అయ్యే దోమ డెంగ్యూ జ్వరంను వ్యాపింపచేస్తుంది. పగటి పూట ఈ దోమ కొరకడం వల్ల ప్రజలకు డెంగ్యూ జ్వరం వస్తుంది. నివాసాల వద్ద నిరుపయోగంగా పడి వుండే కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, ఇంటి లోపల పాత్రల్లో పాత్రలు, తొట్టెల్లో నిల్వ వుంచే నీటి వల్ల ఈ దోమలు ఉత్పత్తి అవుతున్నాయి. ఇంటి పరిసరాలను శుభ్రంగా వుంచుకొని ఎక్కడ నీటి నిల్వకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని ఓ వైపు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్ళి ప్రచారం చేస్తున్నప్పటికీ ఆశించిన ఫలితాలు మాత్రం వుండటం లేదు. క్షేత్ర స్థాయిలో దోమలను పూర్తి స్థాయిలో కట్టడి చేయాలని నిర్ణయించిన వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఎక్కడో ఒకచోట దోమల ఉత్పత్తి మాత్రం నిరాటంకంగా సాగిపోతుండటంతో ప్రజలు దోమ కాటుకు గురై జ్వరాల బారిన పడుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 178 డెంగ్యూ జ్వర కేసులు నమోదైనట్లు జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభం అయినప్పటి నుండి దోమలను కట్టడి చేయడానికి వైద్య ఆరోగ్యశాఖ క్షేత్ర స్థాయిలో పంచాయతీ సిబ్బందిని సమన్వయం చేసుకుని పక్కాగా విధులు నిర్వహిస్తోందని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుండి వైద్య, పంచాయతీ సిబ్బంది క్షేత్ర స్థాయిలో దోమల కట్టడికి చేపట్టిన చర్యలు కొంత మేరకు ఫలితాలు ఇస్తుండటంతో మలేరియా, డెంగ్యూ, చికన్ గున్యా జ్వరాలు ప్రస్తుతం అదుపులో వున్నాయని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. డెంగ్యూ జ్వరం ఎక్కడైనా వచ్చినట్లు సమాచారం అందిన వెంటనే వైద్య, పంచాయతీ సిబ్బంది క్షేత్ర స్థాయికి వెళ్ళి గ్రామ, ఇళ్ళ పరిసరాలను శుభ్రం చేసి దోమలు ఉత్పత్తి కాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. దోమల ఉత్పత్తిని పూర్తి స్థాయిలో కట్టడి చేయడానికి నీరు నిల్వ వున్న ప్రాంతాల్లో మాలథీన్ స్ప్రేయింగ్ చేయడం, నీటిలో ఆయిల్ బాల్స్ వేసి దోమ లార్వాలను నాశనం చేయడం చేస్తున్నామన్నారు. ప్రజలు సైతం పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని, ముఖ్యంలో ఇంటి పరిసరాల్లో ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చేసి దోమల ఉత్పత్తిని పూర్తి స్థాయిలో కట్టడి చేస్తే జ్వరాలు ప్రబలే అవకాశం వుండదని ఆయన తెలిపారు.

## పాల ప్యాకెట్ కోసం వెళ్లి శవమయ్యాడు



తడ, ఆగస్టు 20 ప్రభాతవార్త సోమవారం ఉదయం పాల ప్యాకెట్ కొనుక్కునేందుకు తడ బజారుకు వచ్చి సైకిల్‌పై తిరిగి వెళుతున్న ఉద్దండి చంద్రయ్య (54) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తడ మండలం తడకండ్రిగకు చెందిన చంద్రయ్య స్థానిక నిప్పో పరిశ్రమలో కాంట్రాక్టు లేబర్‌గా పనిచేస్తున్నాడు. చంద్రయ్యను చెన్నై నుంచి నెల్లూరు వైపు వేగంగా వెళుతున్న లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడినట్లు గ్రామస్థులు తెలిపారు. అనంతరం అతన్ని చుట్టుపక్కల వారు నిప్పో అంబులెన్స్‌లో తడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో తమిళనాడులోని రెడ్‌హిల్స్ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం చెన్నై స్టాన్లీ ఆసుపత్రికి తరలించినప్పటికీ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు పోలీసులకు సమాచారం అందింది. ప్రమాదానికి కారణమైన లారీని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చంద్రయ్య శవాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించి ఎస్ఐ నరసింహారావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు

### ఇద్దరు టిఏలు, నలుగురు ఎఫ్ఏలు సస్పెన్షన్

### డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్



గూడూరు, ఆగస్టు 20, ప్రభాతవార్త ఉపాధి హామీ పనుల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపిడివో కార్యాలయంలో జరిగిన సామాజిక తనిఖీలో భాగంగా ఆయన పలు శాఖలో జరిగిన పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ సామాజిక తనిఖీ ద్వారా ఉపాధి హామీ పథకంలో గతంలో చోటు చేసుకున్న లోపాలను సమీక్షించడం జరిగిందన్నారు. చిన్నపాటి లోపాలు తమ దృష్టికి వచ్చాయని, ఆ లోపాలను సరిదిద్దుకునేలా సక్రమంగా పనిచేయాలని సిబ్బందిని ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు టి.ఏలు, నలుగురు ఎఫ్ఏలను సస్పెండ్ చేశారు. గూడూరు మండల పరిధిలోని 19 పంచాయితీల్లో సుమారు 7 కాఓట్ల రూపాయిలు పనులు జరిగాయని, పనుల్లో కొంత అవకతవకలు జరిగాయని గుర్తించడం జరిగిందన్నారు. 6 లక్షల 75 వేల రూపాయలను రికవరీ చేయాలని ఆదేశించారు. భవిష్యత్తులో పథకం అమలులో ఎటువంటి అవినీతికి, అవకతవకలకు పాల్పడకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు. విధుల్లో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వెంకటేశ్వర రావు, డిఎల్‌పివో వెంకటరమణ, ఏపివో పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద మహిళ చేతిలో సచివాలయ పత్రాలు

### -అధికారులను నిలదీసిన బాధితులు

చౌడేపల్లి, ఆగస్టు 20 ప్రభాతవార్త అనుమానాస్పదంగా సంచరిస్తున్న మహిళ చేతిలో సచివాలయానికి సంబంధించిన రికార్డులుండటంతో బాధితులు అధికారులను నిలదీసిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. బాధితుల కథనం మేరకు...మండలంలోని దిగువపల్లి పంచాయతీ గాజులవారిపల్లిలో గల అమ్మవారి ఆలయం వద్ద





ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్న విషయాన్ని గ్రామస్తులు గుర్తించారు. దేవస్థానంలో దొంగతనం చేసే ప్రయత్నం చేస్తున్నారన్న అనుమానంతో వారి వద్దకు వెళ్ళారు. అయితే ముగ్గురు వ్యక్తులు ఇద్దరు పురుషులు పరుగులు తీశారు. వారిలో ఓ మహిళ గ్రామస్తుల చేతికి చిక్కింది. ఆమె చేతిలో వున్న కవర్లను పరిశీలిస్తే చౌడేపల్లి మేదరదొడ్డికి చెందిన పలువురి ఆధార్, ఓటరు జాబితాలు, గత ప్రభుత్వం మంజూరు చేసిన ఆరోగ్యశ్రీ, రేషన్‌కార్డులు వంటివి వున్నాయి. రికార్డుల్లో వున్న ఫోన్ నంబర్లకు గ్రామస్తులు సమాచారమందించారు. దీంతో సంబంధిత రికార్డులను తీసుకొని బాధితులు స్థానిక సచివాలయం–1 వద్దకు వెళ్ళి అధికారులను నిలదీశారు. అప్పట్లో వాలంటీర్‌గా పనిచేస్తున్న వ్యక్తి తప్పిదం వల్ల జరిగిందని అధికారులు బాధితులకు తెలియజేసారు. ఎన్నికలకు ముందు వాలంటీర్ల నుంచి సెల్‌ఫోన్లు, వేలిముద్రల పరికరాలు తీసుకొన్నట్లుగా రికార్డులు సైతం స్వాధీన పరచుకొని వుంటే ఈ పరిస్థితి వుండేది కాదనీ, తమ గుర్తింపు కార్డులు ఎక్కడ పడితే అక్కడ పడేస్తే సమస్యలు వస్తాయన్నారు. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకొని వాలంటీర్లుగా పనిచేసిన వారినుంచి రికార్డులను స్వాధీన పరచుకోవాలని బాధితులు ముబారక్, శ్రీనివాసులు తదితరులు కోరుతున్నారు.

## డాక్టర్లు చేపట్టిన నిరసనకు ఎమ్మెల్యే మద్దతు




తిరుపతి హెల్త్, ఆగస్టు 20, ప్రభాతవార్త కోల్‌కత్తాలోని డాక్టర్ మౌమిత పై అత్యాచారం చేసి అతి కిరాతకంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని తిరుపతి స్విమ్స్ హాస్పిటల్‌లో డాక్టర్లు చేపట్టిన నిరసనకు మద్దతుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టిడిపి ఇన్చార్జి సుగుణమ్మ, జనసేన ఇంచార్జి కిరణ్ రాయల్, నగర అధ్యక్షుడు రాజా రెడ్డి, జనసేన లీగల్ సెల్ శ్యామల తదితరులు పాల్గొని వారికి సంఘీభావం తెలియజేశారు. తక్షణమే నిందితులకు శిక్ష పడాలని బాధిత కుటుంబానికి అందరూ అండగా నిలవాలని వారు కోరారు.

## వైద్యురాలి హత్యకు నిరసనగా క్యాండిల్ ర్యాలీ



రామకుప్పం, ఆగస్టు 20 ప్రభాతవార్త కోల్‌కత్తా నగరంలోని ఆర్‌జికార్ వైద్యకళాశాలలో వైద్య విద్యార్థిని హత్యను ఖండిస్తూ కూటమి నేతలు మంగళవారం సాయంత్రం రామకుప్పంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్దనుంచి బందార్లపల్లి క్రాస్ దాకా ర్యాలీ చేపట్టారు. వైద్యురాలి హత్య కేసులో నిందితుల్ని ఉరితీయాలని నేతలు డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

## ప్రమాదమా.. హత్యాయత్నమా..?

### సంఘటన స్థలాన్ని సిఐ,ఎస్బీ సిఐ పరిశీలన





గంగవరం, ఆగస్టు 20, ప్రభాతవార్త : పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలం నాలుగు రోడ్ల కూడలి సమీపంలో మంగళవారం తెల్లవారుజూమున తెలుగుదేశం నాయకుడుపై జరిగిన దాడి హత్యాయత్నామా.? లేక ఆకస్మికంగా జరిగిన ప్రమాదామా ? లేక కావాలని ఎవరైనా చేసిన దుశ్చర్యపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ ఘటనపై గంగవరం అర్బన్ సిఐ బొడ్డు ప్రసాద్, ఎస్బి సిఐ భాస్కర్, రూరల్ సిఐ మురళీమోహన్‌లు విషయం తెలుసుకున్న వెంటనే ఘటన స్థలాన్ని పరిశీలించి అన్ని కోణాల్లోను విచారణ చేస్తున్నారు. బైరెడ్డిపల్లె మండలం లక్కనపల్లె గ్రామానికి చెందిన రఘుచంద్రగుప్తా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శిగా హోదా కలిగి ఉన్నాడు. రఘుచంద్రగుప్తా నియోజకవర్గంలో పలు వ్యాపార సంస్థలతో పాటు రియల్ ఎస్టేట్, తమిళనాడు రాష్ట్రం చెన్నైలోనూ పలు వ్యాపారాల్లో భాగస్వామిగా ఉన్నాడు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో 100 రోజులుగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. ఆర్థికంగా బలవంతుడు కావడంతో పలమనేరు నియోజకవర్గంలోని కొందరు ఫైనాన్షియర్లతో రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 19న పౌర్ణమి పురస్కరించుకుని తిరువణ్ణమలై గిరి ప్రదక్షణకు పలమనేరుకు చెందిన కొందరు వ్యక్తులతో మరో కార్లో వెళ్ళి ప్రదక్షణల అనంతరం మంగళవారం తెల్లవారుజామున పలమనేరుకు చేరుకున్నాడు. పలమనేరు నుండి తన సొంత కారులో స్వగ్రామానికి వెళ్తుండగా బెంగళూరు చెన్నై జాతీయ రహదారి నాలుగు రోడ్ల కూడలి వద్ద వెళ్తుండగా హఠాత్తుగా ఎదురుగా గుర్తుతెలియని ఓ టెంపో వేగంగా వచ్చి డీకొనడంతో అప్రమత్తమైన రఘుచంద్రగుప్తా కారును రహదారి ఎడమ వైపుకు మళ్ళించి వెంటనే కారు దిగి టెంపో డ్రైవర్‌ను హెచ్చరిస్తుండగా ఇంతలో అదే టెంపో వెనక నుండి మరోసారి కారును డీకొంది. దీంతో ప్రమాదాన్ని పసిగట్టిన రఘుచంద్రగుప్తా చీకట్లో దూరంగా వెళ్ళిపోయి ప్రాణాపాయం నుండి తప్పించుకున్నాట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి సంఘటన స్థలాన్ని పరిశీలించి అన్ని కోణాల్లో ఈ సంఘటనకు గల కారణాలను అన్వేషిస్తున్నారు. ఇక ఈ సంఘటనపై పలమనేరు నియోజకవర్గంలో తీవ్ర స్థాయిలో చర్చ జరుగుతుంది.




## ఘనంగా ప్రపంచ దోమల దినోత్సవ ర్యాలీ

తవణంపల్లె, ఆగస్టు 20 ప్రభాతవార్త:



మండల కేంద్రం తవణంపల్లెలో మంగళవారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. మండల వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్‌వేలు, డాక్టర్ వినయ్ కుమార్‌ల ఆధ్వర్యంలో మండల వైద్యసిబ్బంది స్థానిక పీహెచ్‌సీ నుండి తవణంపల్లె పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. "దోమలు పుట్టకూడదు-దోమలు కుట్టకూడదు" "దోమ తెరలు వాడాలి-దోమలు కుట్టకుండా జాగ్రత్త పడాలి" "ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి" ఇంటి పరసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలి, దోమల మోత, మనకు జ్వరాల వాత, మలేరియా, డెంగ్యూ వ్యాధి అంతం-మనపంతం అంటూ వారు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య పర్యవేక్షకులు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

కాణిపాకంలో...

కాణిపాకం, ఆగస్టు 20 ప్రభాతవార్త: ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా కాణిపాకం పీహెచ్‌సీ పరిధిలోని కాణిపాకం గ్రామంలో మంగళవారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలసి వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. దోమకాటు-ఆరోగ్యానిక చేటు, దోమ చిన్నది-రోగం పెద్దది, దోమ తెరలను వాడుదాం-మలేరియాను నివారిద్దాం, నీటి నల్వలు లేకుండా చూద్దాం-దోమలను నివారిద్దాం అంటూ గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్‌లు శివయ్య, నాగరత్నమ్మ, మనోహర్‌లతో పాటు ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## దోమల రహిత సమాజ ఆవిర్భావమే లక్ష్యం

యాదమరి, ఆగస్టు 20 ప్రభాతవార్త:

దోమల రహిత సమాజ ఆవిర్భావానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని యాదమరి పిహెచ్‌సి డాక్టర్ సురేఖ, సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణలు పిలుపునిచ్చారు. సంతగేటులో మంగళవారం యాదమరి పిహెచ్‌సి సిబ్బంది ప్రపంచ దోమల నివారణ దినోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దోమలు కుట్టకుండా, పుట్టకుండా ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్యకర సమాజం స్థాపించవ చ్చునన్నారు. దోమలు కట్టడికి ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దోమలు నిల్వ వున్న ప్రాంతాలను గుర్తించి వాటిని అంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై పిహెచ్‌సి సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీపతి, ఎంఎల్‌హెచ్‌పిలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## టీచర్ల సర్దుబాటులో అసంబద్ధతలు తొలగింపు

### - ఎస్టీయు డిమాండ్



చిత్తూరు, ఆగస్టు 20 ప్రభాతవార్త: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో అసంబద్ధ నిబంధనలను తొలగించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. డిఇఓ కార్యాలయంలోని డిఇఓ ఛాంబర్‌లో మంగళవారం జిల్లా ఎస్టీయు నాయకులు డిఇఓ దేవరాజులును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీయు నాయకులు డిఇఓ దేవరాజులుతో మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియలో భాగంగా ప్రాథమికోన్నత పాఠశాల్లో పని చేస్తున్న భాషా పండితులు, ఎస్జీటీ ఖాళీల్లో అదే పాఠశాలల్లో కొనసాగించాలని కోరారు. అలాగే స్కూల్ అసిస్టెంట్ల సర్దుబాటు ప్రక్రియ పూర్తయిన తర్వాతనే ఎస్జీటీ, భాషా పండితుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే డిఇఓ పూల్‌లో వున్న భాషా పండితులను స్కూలల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించి శాశ్వత స్థానాల్లో నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టీయు అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, దేవరాజులురెడ్డి, గణపతి, చంద్రన్, కమలాపతి, భాషాపండితులు కె.గోపి, జి.గోపి, స్వామినాయుడు, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

## చెడు వ్యసనాలకు దూరంగా విద్యార్థులు

చిత్తూరు, ఆగస్టు 20 ప్రభాతవార్త: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా వుంటే ఉజ్వల భవిష్యత్తు వుంటుందని టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య అన్నారు. బృందావనం పాఠశాలలో మంగళవారం టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలు, సైబర్ నేరస్తుల వలలో పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య మాట్లాడుతూ క్షణికావేశంలో విద్యార్థులు గంజాయి, డ్రగ్స్‌ను ఉపయోగించి వాటికి బానిస అవుతున్నారన్నారు. డ్రగ్స్, గంజాయికి బానిస అయితే నేరాలు చేసైనా డబ్బులు ఆర్జించాలనే దుర్బుద్ధి పడుతుందన్నారు. అలాగే సైబర్ నేరస్తుల పట్ల ఏ మాత్రం అజాగ్రత్త వహించిన బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు మాయం అవుతాయన్నారు.

## ఖాళీస్థలాలను శుభ్రం చేసుకునే బాధ్యత యజమానులదే

### - మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు



కుప్పం, ఆగస్టు 20 ప్రభాతవార్త

కుప్పం మున్సిపల్ పరిధిలో ఉన్న ఖాళీ స్థలాల యజమా నులు తమ స్థలాల్లో ఉన్న పిచ్చి మొక్కలు, ముళ్లపొదలను తొలగించి క్లీన్ కుప్పం సాధనకు సహకరించాలని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు కోరారు. పలుచోట్ల ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి పాములు, తేళ్లకు ఆవాసంగా మారడంతో ఆ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. సదరు ఖాళీ స్థలాలను శుభ్రం చేయించి చుట్టూ ప్రహరీగోడ నిర్మించుకోవాలని సూచించారు. అలా తొలగించని ఎడల పురపాలక సిబ్బందిచే వాటిని తొలగించి ఖర్చును వసూలు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు ఇందుకు సహకరించాలని కోరారు.

## పేదలకు నిత్యావసరాలు సకాలంలో పంపిణీ చేయాలి

కుప్పంరూరల్, ఆగస్టు 20 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం చౌకదుకాణాల ద్వారా అందిచే నిత్యావసర సరుకులను పేదలకు సకాలంలో పంపిణీ చేయాలని తహశీల్దార్ చిట్టిబాబు ఆదేశించారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతినెలా 1వతేది ఉదయం ఏడు గంటలనుంచే చౌక దుకాణాల్లో ప్రజలకు సరుకులు పంపిణీ చేయాలన్నారు. అలాగే ప్రతి ఎండియు ఆపరేటర్ విధిగా రోజుకు వందమంది లబ్దిదారులకు సరుకులు అందించాలన్నారు. సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్, సభ్యులు, పాల్గొన్నారు.

## ట్రిపుల్‌ఐటికి విద్యార్థిని ఎంపిక



రామకుప్పం, ఆగస్టు 20 ప్రభాతవార్త

స్థానిక కెంపసము ద్రం జడ్పీ హైస్కూల్‌లో చదివిన విద్యార్థిని వాణిశ్రీ ఇడుపులపాయ ట్రిపుట్‌ఐటిలో సీటు సాధించినట్లు హెచ్‌ఎం వెంకటరమణ తెలిపారు. ఈసందర్భంగా వాణిశ్రీని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

## చక్కటి ప్రణాళికలతోనే గ్రామాల అభివృద్ధి

తవణంపల్లె, ఆగస్టు 20 ప్రభాతవార్త:

చక్కటి ప్రణాళికలతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని రీసోర్స్‌పర్సన్ ఎం.హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని గ్రామపంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు, డిజిటల్‌క అసిస్టెంట్‌లకు ఈనెల 19 నుండి 21 వరకు మూడు రోజుల పాటు గ్రామాల అభివృద్ధిపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర భ్ంగా రెండో రోజు మంగళవారం ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌లు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు గ్రామ పంచాయతీ విధులు, అధికారాలు, పంచాయతీ చట్టాలపై అవగాహన కలిగి వుండాలన్నారు. అలాగే చక్కటి ప్రణాళికలతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని తెలిపారు. అలాగే గ్రామాల్లో పారిశుద య్ నిర్వహణ, బృందావనాల నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ, ఇందన పొదుపు వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఈఓపీఆర్డీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రగిరి చరిత్ర తిరగరాసిన పులివర్తి నాని

పాకాల, ఆగస్టు 20, ప్రభాతవార్త

నవ్యాంధ్రప్రదేశ్‌కు రెండవ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన శుభ సమయం, 25 సంవత్సరాలు తర్వాత చంద్రగిరి చరిత్రను తిరగారాసి చంద్రగిరి కోట పై తెలుగుదేశం జెండా రెపరెపలాడించిన మన ప్రియతమ నాయకుడు పులివర్తి వెంకట ముని ప్రసాద్ ఎమ్మెల్యేగా గెలిచినందుకు పాకాల మండలం దామలచెరువు గ్రామం మల్లప్పగారిపల్లి వాస్తవ్యులు అందరూ ఏకమై మల్లప్పగారిపల్లెలో వెలసిన గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లికి పొంగళ్ళు, గంగమ్మ దేవర పెట్టి మేకపోతును గావిచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలందరూ పాల్గొన్నారు.

## రొంపిచెర్లలో ప్రపంచ దోమల దినోత్సవం

రొంపిచెర్ల, ఆగస్టు20ప్రభాతవార్త



మండల పరిదిలోనిరొంపిచెర్ల గ్రామంలో పీహెచ్‌సీ వైద్యులు దినేష్‌కుమార్ నాయక్ ఆద్వర్యంలో ప్రపంచ దోమల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మలేరియా వ్యాధి దోమల వలన వ్యాప్తి చెందుతుందని సర్‌రొనాల్డ్‌రాస్ 1897వసంవత్సరం ఆగస్టు20న కనుగొన్నారని చెప్పారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సీహెచ్‌ఓ కాంతమ్మ, సూపర్‌వైజర్ పంకజ, ఎంఎల్‌పీలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పురవీధులలో ర్యాలీ నిర్వహించారు.

20రొంపిచర్ల1ః ర్యాలీ చేస్తున్న సిబ్బంది

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## నేడు కుప్పం రెస్కో అక్రమాలపై మలిదశ విచారణ

### - పది కోట్ల మేర క్విడ్‌ప్రోకోపై ఫిర్యాదుదారుల వాంగ్మూలం !!

కుప్పం, ఆగస్టు 20 ప్రభాతవార్త

కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (రెస్కో) పరిధిలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్, విచారణాధికారి శ్రీలక్ష్మి బుధవారం మలిదశ విచారణ చేపట్టనున్నారు. ప్రధానంగా ఫిర్యాదుదారులు పేర్కొన్న 10 కోట్ల రూపాయల మేర క్విడ్‌ప్రోకో జరిగిందనే వ్యవహారంపై విచారణ జరగనుంది. ఇప ్పటికే రెస్కోలో చోటు చేసుకున్న అవకవతకలపై ఫిర్యాదు చేసిన చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, షణ్ముగంలు ఈ విచారణకు తప్పక హాజరు కావాలని అదనపు రిజిస్ట్రార్ ఇదివరకే వారు విచారణకు హాజరయ్యేలా సమన్లు జారీ చేసి ఉన్నారు. కాగా రెస్కో అవకతవకలపై గత జూలై నెల 18వతేది అదనపు రిజిస్ట్రార్ శ్రీలక్ష్మి తొలిదశ విచారణ చేపట్టారు. మూడు నాలుగు నెలల్లోపు సమగ్ర విచారణ చేపట్టి కమీషనరుకు నివేదిక అందిస్తామని అప్పట్లో పేర్కొన్నారు. దీంతో విచారణ త్వరగా ముగించేందుకు బుధవారం రెండో దఫా విచారణ చేయనున్నారు.

## ప్రతి కూలీకి పని కల్పించండి :డ్వామా పిడి

సోమల, ఆగస్టు 20, ప్రభాతవార్త

వ్యవసాయ కూలీలకు పని కల్పించాల్సిన బాధ్యత ఉపాధి సిబ్బందిపై ఉన్నదని డ్వామా పిడి రాజశేఖర్ అన్నారు. మంగళవారం ఉదయం ఆయన కూలీలు పనిచేస్తున్న చోటుకు వెళ్లి పనులను పరిశీలించారు. పనులపై కూలీలకు అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. రైతులు ఉద్యానవన పంటలపై దృష్టి పెట్టేలా అవగాహన కల్పించాలన్నారు. యంత్రాలతో పనిచేసినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 23వ తేది గ్రామ సభలు నిర్వహించి రైతులు కోరిన పనులకు అనుమతులు మంజూరు చేయాలని తెలిపారు. సోమల గొల్లపల్లి వద్ద జరుగుతున్న ఫారం ఫండ్ పనులను పరిశీలించి నేరుగా కూలీలతో ముచ్చటించారు. కార్యక్రమంలో ఏపిడి శ్రీనివాసులు, ఏవో దినకర్ బాబు, జేఈ రెడ్డప్ప, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు టీకాలు ప్రారంభం

శాంతిపురం, ఆగస్టు 20 ప్రభాతవార్త

పశువులకు గాలికుంటు వ్యాధి ప్రబల కుండా ముందస్తుగా టీకాలు వేసే కార్యక్రమాన్ని బడుగుమాకుల పల్లిలో మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, ఎల్.జయరా ంరెడ్డి, ఎవి జయరాంలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రైతులు పశువులకు తప్పక గాలికుంటు టీకాలు వేయించాలని ప్రభుత్వం కూడా పశు సంరక్షణకు తగు చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నేతలు ఈడిగ రమేష్, జయ, గద్దూరు రమేష్, శేఖర్, పశువైద్యులు సయ్యద్ షాహదుల్లా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## కావడి పూజలలో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

సదుం, ఆగస్టు 20 ప్రభాతవార్త



తంబళ్లపల్లె శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి మంగళవారం కావడి పూజలలో పాల్గొన్నారు. ఉదయం ఆయన యర్రాతివారిపల్లెలోని స్వగృహంలో ప్రత్యేక పూజలు చేసుకుని కావడిని ఎత్తుకున్నారు. అనంతరం సదుంలోని గార్గేయనది ఒడ్డున వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి వారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో ప్రదక్షణలు చేసి కావడి మొక్కులు చెల్లించారు. సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆయనను శేష వస్త్రంతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట సతీమణి కవితమ్మ, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సతీమణి స్వర్ణలతమ్మ, మాజీఎంపీపీపెద్దిరెడ్డి ఇందిరమ్మా, పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, ఏ.రెడ్డెప్పరెడ్డిలు పాల్గొన్నారు. ఆలయం వద్ద వారికి ఆలయ కమిటీ సభ్యులుకృష్ణారెడ్డి, మల్‌రెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి, మేస్త్రీ రాజన్నలు స్వాగతం పలికారు. అంతకు ముందు కంబంవారిపల్లెకు చెందిన కువైట్ హరినాధరెడ్డి, హేమలత దంపతులు రూ.1.20లక్షల విలువైన వెండి నాగాభరణాన్ని ఆలయానికి అందజేశారు.

## గాలికుంటు వ్యాధి పట్ల అప్రమత్తంగా వుండాలి

చౌడేపల్లి, ఆగస్టు 20 ప్రభాతవార్త

గాలి అమ్మోరు(కుంటు)వ్యాధి పట్ల పాడి రైతులు అప్రమత్తంగా వుండాలని మండల పశువైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా చౌడేపల్లి పరిధిలోని చిట్రెడ్డిపల్లిలో పశువులకు గాలికుంటు నివారణా టీకాలు వేశారు. ఈనెల 20నుంచి సెప్టెంబర్ 18వరకు గాలికుంటు టీకాలేసే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## 23న గ్రామసభలను విజయవంతం చేయండి

తడ, ఆగస్టు 20 ప్రభాతవార్త

ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి జరుగుతున్న గ్రామసభలు తడ మండలంలో 18 చోట్ల జరుపుతున్నామని, విజయవంతం చేయాలని ఎంపిడిఓ ఎన్.విజయకుమార్ తెలిపారు. వీటిలో 16 చోట్ల ఉదయం 11 గంటలకే ఈ సభలు ప్రారంభమవుతాయని, కారిజాత, పూడి గ్రామ సచివాలయాల్లో మాత్రం మధ్యాహ్నం 2 గంటలకు గ్రామసభలు మొదలవుతాయని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా సిమెంటు రోడ్లు నిర్మాణం, రెగ్యులర్ వర్కుల మీద తీర్మానాలు పెట్టి ఆమోదింపచేసుకోవాలన్నారు. గ్రామస్థాయిలోని అన్ని శాఖల సిబ్బంది గ్రామసభల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఎక్కువ మంది గ్రామ ప్రజలతో పాటు ఉపాధి హామీ కూలీలను కూడా రప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు, మండల కార్యాలయ సిబ్బంది, కొన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా నవీకరణలో బీఎల్‌వోలు

కోట, ఆగస్టు 20 ప్రభాతవార్త

ఓటరు జాబితా నవీకరణ (సవరణ) ను ఎన్నికల సంఘం షెడ్యూడల విడుదల చేసింది. స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024 లో భాగంగా ఓటరు జాబితా తయారు చేయనున్నారు. ఈ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభమైంది. బూత్ స్థాయి అధికారులు ( బీఎల్‌వో) ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తారు. ఇప్పుడున్న జాబితాలో పేర్లు ఉన్నవారు శాశ్వతంగా ఎక్కడైనా వెళ్లిపోయారా? చనిపోయారా? పేర్లలో తప్పులు ఉన్నాయో అని తెలుసుకుంటారు. ఇప్పటికీ జాబితాలో పేరు లేకుంటే వారి నుంచి దరాస్తు తీసుకుంటారు. ఈ ప్రక్రియ లో తప్పులు లేకుండా జాత్రలు తీసుకోవాలని ఎన్నికల సంఘం సూచిచింది. ఓటరు జాబితా ముసాయిదాను అక్టోబరు 29న ప్రకటిస్తారు. వాటిని మరో సారి క్షేత్ర స్థాయిలకి వెళ్లి డిసెంబరు 24 వ తేదీ లోపు పరిష్కరిస్తారు. అనంతం అధికారులు తుది జాబితాను 2025 జనవరి 6 వ తేదీన ప్రకటిస్తారు.

**యువత నమోదు చేసుకోవాలి :**

18 ఏళ్లు నిండిన వారు ఓటరు జాబితాలో సేరు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని తహిసిల్దార్ జయజయరావు తెలిపారు. ఓటు హక్కు లేని వారు ఫారం 6 దరఖాస్తును స్థానిక బీఎల్‌వోకు అందజేయవచ్చున్నారు. దీంతో పాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొవచ్చాన్నారు. దేశ భవిష్యత్తు అయిన యువత ఓటరుగా తమ పేరు నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

## వివాదాస్పద భూములను పరిశీలించిన తహసిల్దార్

దొరవారిసత్రం ఆగస్టు 20 ప్రభాతవార్త;

దొరవారిసత్రం మండలంలోని భూదూరు గ్రామంలో వివాదాస్పధ భూములను తహసిల్దార్ శైలాకుమారి తనసిబ్బందితో కలిసి మంగళవారం పరిశీలించారు. గతవారం గ్రీవెన్స్‌డేలో భూదూరు గ్రామానికి చెందిన సాలు అంకయ్య, దొరబాబు, రవీంద్ర, చెంగయ్య మరోకొంతమంది రైతులు కలిసి మాభూములు మాకు ఇపించాలంటూ తహసిల్దార్‌కు పిర్యాదుచేసిన విషయం విదితమే. ఆవిషయమై తహసిల్దార్ భూదూరు గ్రామానికి చేరుకొని వివాదాస్పధ భూములను క్షుణంగా పరిశీలించి సిబ్బంది ద్వార ఆభూములకు సంభందించిన పూర్తివివరాలు తెలుసుకొన్నారు. అనంతరం రైతులతో మాట ్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా తహసిల్దార్ మాట్లడుతూ భూదూరు 44నుండి59వరకు ఉన్న సర్వేనెంబరులో వివాదాస్పధ భూముల వివరాలు పూర్తిస్థాయిలో విచారించి ఉన్నతాదికారుల ఆదేశాల మెరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## నిందితులను బహిరంగంగా ఉరితీయాలి

### పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు సునీల్

గూడూరు, ఆగస్టు 20, ప్రభాతవార్త



జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనలో నిందితులను బహిరంగంగా ఉరి తీయాలని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు సునీల్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని గూడూరు రైల్వే స్టేషన్ నుండి కూరగాయల మార్కెట్ వరకు పిడిఎస్‌యు ఆధ్వర్యంలో 200 మంది నర్సింగ్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. సునీల్ మాట్లాడుతూ దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మహిళల భద్రతకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలను తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు డివిజన్ ఇంచార్జి చరణ్, ప్రసాద్, పట్టణ నాయకులు వెంకటేశ్వర్లు, నాగూర్, హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ దుకాణాలకు వేలంపాటలు నిర్వహించాలి

### - పంచాయతీ అభివృద్ధిని అడ్డుకుంటున్న టిడిపి

కోట, ఆగస్టు 20 ప్రభాతవార్త



మేజర్ పంచాయతీ కోటలోని ఆర్‌అండ్‌బి రోడ్డు పక్కన పంచాయతీ స్థలంలో నిర్మించిన ఆర్టీసీ కాంప్లెక్స్ దుకాణాలకు వెంటనే వేలంపాటలు నిర్వహించాలని పంచాయతీ పాలకవర్గం సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వెంకటరమణమ్మ అధ్యక్షతన పాలకవర్గం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాలకవర్గం సభ్యులు మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధిపై తెలుగుదేశం పార్టీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే వేలంపాటలకు సహకరించాలని కోరారు. టిడిపి అధికారంలోకి వచ్చి మూడు నెలలు అవుతున్నా వేలంపాటలు నిర్వహించలేకపోవడం సిగ్గుచేటన్నారు. 10 శాతం అద్దెలు పెంచుకుంటూ పోతామని టిడిపి నాయకులు డిఎల్‌పిఓకి సిఫార్సు చేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు. వేలంపాటలు నిర్వహిస్తే నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందన్నారు. ఆ మేరకు డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలంటూ పాలకవర్గంతో పాటు నిరుద్యోగులు లేఖలు పంపినట్లు తెలిపారు.

## హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

కోట, ఆగస్టు 20 ప్రభాతవార్త

కోట మండలం చిట్టేడు, కోట బిసి గురుకులం, ఎస్సీ గురుకులం సంక్షేమ వసతి గృహాలను మంగళవారం ఎంపిడిఓ భవాని ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. హాస్టల్‌లో పరిశుభ్రమైన వాతావరణం ఉండాలని ఆమె సూచించారు. వంట తయారు చేసిన అనంతరం పాత్రలపై మూతలు ఉండేటట్లు చూడాలన్నారు. విద్యార్థులకు వేడివేడిగా భోజనం పెట్టాలని సూచించారు. ఎక్కడైనా లోపాలు కనిపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ : తహసీల్దార్

కోట, ఆగస్టు 20 ప్రభాతవార్త

అర్హత కలిగిన వారు కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని తహశీల్దార్ జయజయరావు చెప్పారు. మంగళవారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో పంచాయతీ కార్యదర్శులతో పాటు వీఆర్‌ఓలతో ఓటర్ల జాబితాపై తహశీల్దార్ అవగాహన కల్పించారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే వారందరూ ఓటు హక్కు పొందడానికి ఆన్‌లైన్ లేదా బీఎల్‌ఓల ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. అలాగే జాబితాలో మార్పులు, చేర్పులు, అనర్హుల పేర్ల తొలగింపు ఉంటే కూడా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా నవంబర్ 9, 10, 23, 24 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో బూత్‌స్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## దోమల నిర్మూలనతోనే అనేక వ్యాధులు దూరం

సదుం, ఆగస్టు20ప్రభాతవార్త

దోమల నిర్మూలనతోనేఅనేక వ్యాధులు దూరం అవుతాయని చెరకువారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాదికారి గిరీషా అన్నారు. మంగళవారం చెరకువారిపల్లె, సదుం గ్రామాలలో ప్రపంచ దోమల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ర్యాలీ చేపట్టి నినాదాలిచ్చారు. దోమలు కుట్టకుండా ,దోమలు పుట్టకుండా తగినజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమ రహిత సమాజం ఆరోగ్యానికి సోపానం అన్నారు. మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందాలని సూచించారు. డ్లో ద్వారా సంక్రమించే వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని సిబ్బంది దీనిపై ప్రజలకు ఆరోగ్య విద్యద్వారా అవగాహన కల్పించాలన్నారు. పాలమంద గ్రామంలో ఎంపీహెచ్ఈఓ ఉదయ్‌భాస్కర్ ఆద్వర్యంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షక సిబ్బంది నీలకంఠ, జానకి, శిఖామణి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామ దేవతకు మొక్కులు చెల్లింపు

యర్రావారిపాలెం, ఆగస్టు20ప్రభాతవార్త

ఎర్రావారిపాలెం మండలం నెరబైలుపంచాయతీ చింతకాయల హరిజనవాడకుచెందిన సావిత్రమ్మ మంగళవారం గ్రామ దేవత మాతమ్మకు మొక్కులు చెలించారు. నారా చంద్రబాబునాయుడుని అరెస్టు చేయడంతో ఆయన విడుదల కావాలని ముఖ్యమంత్రి కావాలని కోరుకొన్నానని ఈసందర్భంగా చెప్పారు. అదేవిధంగా పులివర్తి నాని చంద్రగిరి ఎమ్మెల్యేగా గెలవాలని మొక్కుకున్నానని తెలిపారు. ఆయన గెలవడం జరిగిందని, తన కోర్కెలు తీరడంతో మొక్కులుఫలించి గ్రామ దేవతకు మొక్కులు చెల్లించానని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పదోన్నత పొందిన ఉమామహేశ్వర్‌కు ఘన సన్మానం

వాకాడు, ఆగస్టు 20, ప్రభాతవార్త



వాకాడు పంచాయితీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఉమామహేశ్వర రావు పదోన్నతి పొంది వెంకటగిరి ఈఓపిఆర్డిగా వెళ్తున్న సందర్భంగా మంగళవారం ఉప సర్పంచ్ పాపారెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధన్వర్యంలో 1వ సచివాల యంలో ఘన సన్మానం చేపట్టారు. ఒకటి, రెండవ సచివాలయం సిబ్బంది ఉమామహేశ్వ రరావుకు సన్మానం కార్యక్రమంలో పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఉమామహేశ్వర రావు పనితీరు బేష్ అని అన్నారు. ఉమామహేశ్వరకు శాలువ కప్పి పలువురు సిబ్బంది మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి తిరిగి ఓటర్ల జాబితా తయారీ



వెంకటగిరి, ఆగస్టు 20, ప్రభాతవార్త

ఇంటింటికి తిరిగి నిర్వహించే ఓటర్ల జాబితా సర్వేకి రాజకీయ పార్టీల వారు సహకరించాలని తహశీల్దార్ మునిలక్ష్మి తెలిపారు. వెంకటగిరిలోని తహశీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితా తయారీపై రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 20వ తేది నుండి అక్టోబర్ నెల 18వ తేది వరకు సర్వే జరుగుతుందని తెలిపారు. సర్వే చేసే బిఎల్‌ఓలకు పూర్తి వివరాలు తెలపాలని కోరారు. పేర్లలో తప్పులు, ఫోటోలు మార్కులు తదితర వాటిని సవరిస్తానని చెప్పారు. ఓటర్ల సర్వేకి అందరూ సహకరించాలని కోరారు. సమావేశాలు ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ యువరాజు, టిడిపికి చెందిన మాజీ ఏఎంసి చైర్మన్ రాజేశ్వర రావు, బిజెపి నాయకులు దశయ్య, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు

గూడూరు, ఆగస్టు 20, ప్రభాతవార్త



పశువుల్లో గాలి కుంటు నివారణకు టీకా ఒక్కటే మార్గం అని పశు వైద్యులు సుదర్శన్ రావు పేర్కొన్నారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలి కుంటు వ్యాధి నివారణకు గూడూరు 1,2 వార్డులో, చెన్నూరు, కొండా గుంట, తిప్పవరప్పడు తదితర గ్రామాల్లో సుమారు 296 పశఉవులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4 నెలలు దాటిన ప్రతి పశువుకు తప్పనిసరిగా టీకా వేయించాలన్నారు. ముఖ్యంగా పశువులలో తీవ్రమైన జ్వరం, నీరసం, కొద్దిపాటి ఎండకే రొప్పడం, చూడి పశువులు ఈసుకుపోవడం, ఎద్దులలో పనిసామర్థ్యం తగ్గిపోవడం వంటి లక్షణాలుంటాయన్నారు. గాలికుంటు వ్యాధితో పశువులలో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందన్నారు. పాలు తాగే దూడలలో మరణాలు సంభవించే అవకాశం ఉంటుందన్నారు. పాడి రైతులందరూ తప్పనిసరిగా తమ పశువులకు టీకాలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు రెడ్డి, పశు సంవర్ధక సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐ పవన్‌కుమార్‌కు సన్మానం

కోట, ఆగస్టు 20 ప్రభాతవార్త



కోటలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ పవన్‌కుమార్‌ను మంగళవారం బిజెపి నాయకులు సన్మానించారు. పోలీసుస్టేషన్‌లో ఎస్ఐని కలిసి బొకే అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు, దువ్వూరు గిరిధర్‌రెడ్డి, పాదర్తి రాధాకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

# తిరుపతి డివిజన్

# సీజనల్ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేయకండి



వడమాలపేట, ఆగస్టు 20 ప్రభాతవార్త: పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు నిర్లక్ష్యం చేయరాదని పశు సంవర్ధకశాఖ తిరుపతి ఉప సంచాలకులు డా. ఉమామహేశ్వరి పేర్కొన్నారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఉచిత గాలి కుంటి వ్యాధి టీకాల కార్యక్రమంలో నిర్వహించారు. ఇందులో భాగంగా టీసీ అగ్రహారం గ్రామంలో పశువులకు గాలికుంటి వ్యాధి నిరోధక టీకాలు, పేయ దూడలకు బ్రూ స్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ఉమామహేశ్వరి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ గాలి కుంటి వ్యాధి సోకితే పాల ఉత్పత్తి పని సామర్థ్యం తగ్గి రైతుకు ఆర్థిక నష్టం వస్తుందని, పాలు తాగే దూడల్లో మరణాలు కూడా సంభవిస్తుందని, సకాలంలో వైద్యం చేయకపోతే పశువు కూడా మరణించే అవకాశం ఉంటుందని, అంతేకాక పశువులకు ఈ టీకా వేస్తే పాలు తగ్గడం కాని గర్భస్రావం కాని జరగదని అవగాహన కల్పించారు. అంతేకాక వీటితో పాటు నాలుగు నుంచి 8 నెలల పేయ దూడలకు బ్రూ స్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు కూడా వేస్తున్నామని తెలియజేశారు. కావున పాడి రైతులు పై రెండు టీకాల ఆవశ్యకతను గుర్తించి పశువులకు, పేయ దూడలకు టీకాలను వేయించు కోవాలని కోరారు. ప్రభుత్వం ప్రవేవపెట్టిన మినీ గోకులం పథకాన్ని సబ్సిడీ మీద పశువుల ఇన్సూరెన్స్ స్కీమును కూడా ఉపయోగించుకుని, పాడి పరిశ్రమను అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. మంగళవారం మండలంలోని టీసీ అగ్రహారం, ఓటీఆర్ కండ్రిగ గ్రామాల్లో 350 పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి మురళీధర్‌రెడ్డి, లోకనాథం, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏర్పేడు వ్యాసాశ్రమాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



ఏర్పేడు, ఆగస్టు20, ప్రభాతవార్త : మండల కేంద్రమైన ఏర్పేడు సమీపం లోని నంది కొండ పర్వతం వద్ద వెల సిన శ్రీశ్రీ సద్గురు మళయాల స్వాము ల వారి వ్యాసాశ్రమాన్ని మంగళవారం తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అకస్మిక తనిఖీ చేశారు. ఏర్పేడులో నాలుగవ తరగతి నుండి డిగ్రీ వరకు నిర్వ హిస్తున్న రెసిడెన్సి యల్ పాఠశాల, కళాశాల భోజన శాలను, కిచెన్ వాటి పరిసరాలను తిరుపతి జిల్లా డా,ఎన్ వెంకటేశ్వర్ ఆకస్మిక తనికీ చేసి సక్రమంగా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆహారం నాణ్యతగా ఉండాలని పిల్లలకు రక్షిత మంచి నీరు అందించాలని పలు అంశాలపై,సూచిస్తూ సదరు ఆశ్రమ నిర్వాహకులను హెచ్చరించారు. పిల్లలకు ఆరోగ్యం ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఒక ఏఎన్ఎం ఏర్పాటు చేసుకోవాలని, మళ్లీ 45 రోజుల్లో తనికీ చేస్తానని మార్పు ఉండాలని నిర్వాకులను హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యాసాశ్రమ కోశాధికారి మన్నెం అమరనాథరెడ్డి, ఏర్పేడు తహసిల్దార్ ఎంభార్గవి, ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు,

## తక్షణం ఉపాధ్యాయుల సర్దుబాటును ఆపివేయాలి : ఆపస్

తిరుపతి విద్య, ఆగస్టు 20 ప్రభాతవార్త : తక్షణం ఉపాధ్యాయుల సర్దుబాటును ప్రభుత్వం తక్షణం ఆపివేయాలని లేని పక్షంలో బహిష్కరణ పిలుపు ఇవ్వాల్సి ఉంటుందని, మండల స్థాయిలో ఎస్జిటీల అవసరం ఉన్నప్పటికీ ముఖ్యంగా క్వాలిఫైడ్ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను బలవంతంగా ఇష్టం లేకపోయినప్పటికీ ఉన్నత పాఠశాలకు కేటాయిస్తున్నారు. గతంలో ఇదే అర్హత కలిగినప్పటికీ ప్రమోషన్ వద్దనుకున్న ఎస్జీటీలను సైతం ప్రస్తుతం బలవంతంగా ఉన్నత పాఠశాలకు పంపించడం సరికాదు. ఎస్జీటీలను ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు చేసే విషయంలో వారి ఇచ్ఛకాన్ని పరిగణలో తీసుకోవాలి. బలవంతంగా ఉన్నత పాఠశాలలకు పంపడం సరికాదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి గట్ల సాంబిరెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆపస్ తిరుపతి జిల్లా సహాధ్యక్షులు డాక్టర్ మొర్రిమేకల దేవరాజులు మాట్లాడుతూ డీవో పూల్‌లో పనిచేస్తున్నటువంటి పండితులను 2019 నుంచి ఇప్పటివరకు బదిలీలు జరిగిన ప్రతిసారీ స్థాన చలనం చేస్తున్నారని, ప్రస్తుతం సర్దుబాటులో కూడా వారి పోస్టులను మిగులు పోస్టులుగా చూపించి వేరే ప్రాథమిక తరగతుల మెథడాలజీ చదవకున్ననూ వారిని ప్రాథమిక పాఠశాలలకు కేటాయించడం అన్యాయమని ఇప్పటికే 5 సంవత్సరాలుగా పదోన్నతి రాకుండా శాశ్వతమైన స్థానం లేకుండా తీవ్ర నిర్వేదంలో ఉన్న డిఈవో పూల్ పండితులను ఇబ్బందులకు గురి చేయడం తగదంటూ, వారిని యధాస్థానంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా శ్రావ్స్ అసోసియేషన్ ప్రారంభోత్సవం



తిరుపతి విద్య, ఆగస్టు 20 ప్రభాతవార్త : సాటి మనిషికి సాయపడటం పౌరు లందరి సామాజిక బాధ్యతని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం మాజీ రెక్టార్ ఆచార్య మచ్చా భాస్కర్ పేర్కొన్నారు. డాక్టర్ సోమేసుల స్వప్నరేఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రావ్స్ అసోసియేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం తిరుపతి యూత్ హాస్టల్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆచార్య మచ్చా భాస్కర్ మాట్లాడుతూ శ్రావ్స్ ఆధ్వర్యంలో సేవ, పరిశోధన అనే రెండు అంశాలతో కార్యక్రమాలు రూపకల్పన చేయడం అభినందనీయమన్నారు. అభయక్షేత్రం నిర్వాహకులు డాక్టర్ తస్లీమా మాట్లాడుతూ నిరాదరణకు గురౌతున్న వర్గాల సంక్షేమంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర గురించి తెలియజేశారు. శారీరక, మానసిక ఎదుగుదల లేని వారిలో సైతం నైపుణ్యాలను వెలికితీసే కార్యక్రమాలను స్వచ్ఛంద సంస్థలు చేపట్టాలని కోరారు. శ్రావ్స్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సోమేసుల స్వప్నరేఖ మాట్లాడుతూ రెండు దశాబ్దాల క్రితం తాను సంకల్పించిన సంస్థ ప్రస్తుతం ఆవిర్భవించడం సంతోషంగా ఉందన్నారు. సీనియర్ జర్నలిస్టు సురేంధర్ రెడ్డి మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవగా ముందుకెళుతున్న అందరికి ధన్యవాదములని, శ్రావ్స్ సంస్థ అసోసియేషన్‌కు అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో వీరికి ప్రతి ఒక్కరు అండగా వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో పారంపర్య వైద్య మహాసంఘం కోశాధికారి బాలకృష్ణ, ఆదరణ సంస్థ నిర్వాహకులు వసంతమ్మ, రాజా, హరికృష్ణ, హమీద, ఉదయ్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్పీ వెంకటాద్రిని సన్మానిస్తున్న యలమంచిలి ప్రవీణ్



రేణిగుంట, ఆగస్టు 20 ప్రభాతవార్త: రేణిగుంట నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎం.వెంకటాద్రిని పలువురు ప్రముఖులు పుష్పగుచ్ఛాన్ని బహుకరించి అభినందించారు. కడప జిల్లాకు చెందిన కె.రాజరత్నం ఐజగ్, అనంతపూర్ జిల్లాకు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ కె.శంకరయ్య, బెంగళూరు చెందిన ప్రముఖ బిల్డర్ ఎస్.రవీంద్రారెడ్డి, తిరుపతి జిల్లా నర్సింగ్ కాలేజీల అధ్యక్షులు వై.ప్రవీణ్ తదితరులు ఆయన గతంలో పనిచేసిన ప్రదేశాల్లో చేసిన సేవలను కొనియాడారు.

## శ్రీకాళహస్తిలో రాజీవ్‌గాంధీ జయంతి



శ్రీకాళహస్తి,ఆగస్టు 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో రాజీవ్‌గాంధీ జయంతిని రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఎస్ బత్తెయ్యనాయుడు సారధ్యంలో ఘనంగా జరిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ జన్మదినోత్సవాన్ని సద్భావన దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. భారత దేశానికి ఎనలేని సేవలందించిన ఆయనను జనం మరచిపోరన్నారు. నేడు ప్రపంచాన్ని శాసిస్తున్న సెల్‌ఫోన్ రాజీవ్‌గాంధీ ఆలోచనే అన్నారు.అతి చిన్నవయస్సు 40 సంవత్సరాల్లో ప్రధాని మంత్రి పదవిని అలంకరించిన రాజీవ్‌గాంధీ 401సీట్లుతో రాజ్యమేలారన్నారు. ఆయన ఐటి,టెలిరంగాల్లో పునాది వేసినారన్నారు.యువత రాజకీయాల్లోకి రావాలని ఓటు వయస్సును 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించారన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను 73,74 సవరణల ద్వారా అధికారాలు కల్పించారన్నారు.ఇలా ఎన్నోసామాజిక హిత కార్యక్రమాలను రాజీవ్‌గాంధీ చేపట్టడం గమనించదగ్గ విషయం అన్నారు.ఈ కార్యక్రమాల్లో వెంకటముని, వీరరాఘవరెడ్డి, శివయ్య, గోపి, నాగూరయ్య, ఆర్ముగం, వెంకటేష్, మహేష్, భాస్కర్, వానమ్మ, భానమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సీఆర్ఎస్ కార్మిక నేత మృతి

రేణిగుంట, ఆగస్టు 20 ప్రభాతవార్త: రేణిగుంట సీఆర్ఎస్‌లో సీనియర్ టెక్నిషియన్‌గా విధులు నిర్వహిస్తున్న సౌత్‌సెంట్రల్ రైల్వే బ్రాంచ్ సంఘ ఈసీ మెంబరు గౌరీశంకర్ మంగళవారం మృతి చెందారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ రేణిగుంట(కరకంబాడి) అమర ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల సీఆర్ఎస్ సంఘ బ్రాంచ్ నేతలు, కార్మికులు ప్రగాఢ సంతాపం తెలుపుతూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్మిక నాయకునిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు.

## ఉత్తమ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా అంబేడ్కర్ స్టార్ కృష్ణ



రేణిగుంట, ఆగస్టు 20 ప్రభాతవార్త: తిరుపతి మంగళం డిపోలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఏపీఎస్ఆర్టీసీ బహుజన ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంబేడ్కర్ స్టార్ కృష్ణకు ఉత్తమ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా తిరుపతి జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి తిమ్మారెడ్డి చెంగల్‌రెడ్డి చేతుల మీద అవార్డు అందుకున్నారు. మంగళం డిపోలో బస్సులను ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా నడుపుతూ ఇటు తిరుమల, అటు అరుణాచలం పుణ్యక్షేత్రాలకు సకాలంలో బస్సులను సమకూరుస్తూ ఆదాయం పెంచి అధికారులకు, ప్రయాణికులకు సంతృప్తి కలిగించినందుకు ఈ అవార్డు లభించింది.

## జనసేన సారధ్యంలో నల్లజెండాలతో నిరసన



శ్రీకాళహస్తి,ఆగస్టు 20 ప్రభాతవార్త : కోల్ కత్తాలోని డాక్టర్ మౌనితని దారుణంగా హింసించి అత్యాచారం జరిపిన సంఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని జనసేన సారధ్యంలో సుమారు 300 మీటర్ల నల్లజెండాలతో నిరసన తెలిపారు. మంగళవారం జనసేన పార్టీ ఇన్‌చార్జి వినూత కోట సారధ్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. అతి కిరాతకంగా హత్య చేసిన నిందితులను శిక్షించాలని కోరుతూ 500 మంది మహిళలతో సుమారు 3కిలో మీటర్లు బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి పాతవరదయ్యపాళెం రోడ్డు జయరామారావువీధి నాలుగుమాడవీధుల్లో నిరసన ర్యాలి నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో వినూత కోటతో పాటు వీర మహిళలు గాయత్రి, లక్ష్మీ, రాజ్యలక్ష్మీ, శారద, కవిత, ల సారధ్యంలో మహిళలు పెద్ద ఎత్తున నిరసన ర్యాలి జరిపారు.

## ఓటర్లనమోదు తొలగింపులను సక్రమంగా చేపట్టాలి : తహసీల్దార్



బుచ్చినాయుడు కండ్రిగ, ఆగస్టు 20 ప్రభాతవార్త: ఓటర్లనమోదు తొలగింపు పేర్లు ఫోటోలు సరి చేసుకోవడం వంటి విషయాలపై బీఎల్‌వోలు ఎటు వంటి తప్పులు చోటు చేసుకోకుండా సక్రమంగా చేపట్టాలని తహసీల్దార్ ఐ.సుబ్రహ్మణ్యం తెలియ జేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 35 మంది బీఎల్‌వోలకు ఓటర్లనమోదులపై తహసీల్దార్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18 సంవత్సరాలు పూర్తయిన యువకులకు నూతనంగా ఓటు నమోదు, పెళ్లయి వెళ్లిన మహిళల ఓట్లు తొలగింపు, పెళ్లైన వారి ఓట్లు నమోదు, పేర్లు, అడ్రస్సులు, ఫోటోలు మార్పు చేసుకోవడం ఎటువంటి ఫారాలు ఉపయోగించాలి వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఓటరు నమోదు విషయంలో ఇటువంటి తప్పులు చోటు లేకుండా సక్రమంగా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## బడిఈడు పిల్లలు బడిలోనే విద్య జ్ఞాన నేత్రం

బుచ్చినాయుడు కండ్రిగ, ఆగస్టు 20 ప్రభాతవార్త: చదువుకునే వయసులో బడిఈడు పిల్లలు బడిలోనే చదువుకోవాలని కూలిపనుల కోసం వారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేయడం మంచిది కాదని విద్య భవిష్యత్‌లో ఒక జ్ఞాన నేత్రంగా మార్గం చూపిస్తుందని ఎంఈవో రవీంద్రనాథ్ తెలిపారు. మంగళవారం మండలంలోని నీర్పాకోట గిరిజన కాలనీలో ఆయన పర్యటించి బడి మానేసిన పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు పిల్లలకు చదువు యొక్క ఆవశ్యకత సమాజ పరిస్థితుల గురించి వివరించి ముగ్గురు పిల్లలను బడిలో చేర్చడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంపూర్ణ అక్షరాచిత వంతులను తీర్చిదిద్ది భవిష్యత్‌లో సమాజం పట్ల అవగాహన సాధించడం కోసం ఏకలవ్య గురుకుల పాఠశాలలో, పలు సంక్షేమ, ఓపెన్ స్కూళ్ళలో, అంబేడ్కర్ ఓపెన్ అభ్యసన ద్వారా అభివృద్ధిని సాధించాలని ప్రభుత్వాలు ప్రయత్నిస్తుంటే తల్లిదండ్రులు మాత్రం వారి ఆర్థిక పరిస్థితి దృష్ట్యా పిల్లలను విద్యకు దూరం చేయడం అనాగరికమని పేర్కొన్నారు.

## వృద్ధాశ్రమంను తనిఖీ చేసిన తహసీల్దార్



పిచ్చాటూరు, ఆగస్టు 20 ప్రభాతవార్త: పిచ్చాటూరు మండలం వృద్ధుల సంక్షేమ కేంద్రాన్ని తహసీల్దార్ రమేష్‌బాబు మంగళవారం తనిఖీ చేశారు. ఆశ్రమంలోని రికార్డులను పరిశీలించి, అనంతరం ఆశ్రమ గదులను, వంట గదులను పరిశీలించి ఆశ్రమ శుభ్రత పట్ల సంతృప్తి వెలిబుచ్చారు. ఆశ్రమ అధికారి త్యాగరాజుతో మాట్లాడుతూ వృద్ధుల ఆరోగ్యం పట్ల, పరిశుభ్రత పట్ల శ్రద్ధ కలిగి ఉండాలని ఆయనకు సూచించారు. ఆశ్రమ నిర్వహణ పట్ల సంతృప్తి సంతోషాన్ని వ్యక్తపరచారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వోలు నాగభూషణం, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## పుత్తూరు స్కౌట్స్ సేవలు ప్రశంసనీయం



పుత్తూరురూరల్, ఆగస్టు 20 ప్రభాతవార్త: పుత్తూరులో ఆగస్టు 16,17,18 మూడు రోజులు జిల్లా చీఫ్ కమిషనర్ స్కౌట్స్ అండ్ గైడ్స్, జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ ఆదేశాల మేరకు శ్రీ ద్రౌపదీదేవి బ్రహ్మోత్సవాలలో విశిష్ట సేవలతో 320 మంది స్కౌట్స్ సేవలను ఆలయ అధికారులతో పాటు పోలీసు శాఖకు సంబంధించిన ఎస్ఐ వెంకట మోహన్ కృష్ణ, అధికారులు కూడా విద్యార్థుల యొక్క స్కౌట్స్ విద్యార్థుల సేవలను గుర్తించి వారిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ స్కౌట్స్ ఏ.వెంకటేశ్వరులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ గోపి, శివ, భూపతి,జయదేవ్, నరసింహులు, నాగేంద్ర, గైడ్ కెప్టెన్ సుజాత, సునీత, నాగరత్నం, రెడ్డివాణి, రాధిక, మోహన్, అరుణ, జయప్రద, రోవర్ లీడ్ మూర్తి, భాను, రేంజర్ లీడర్ భువనేశ్వరి, మేఘన, సంగీత, శైలజ, హేమలత, యువశ్రీ, గొల్లపల్లి రాజా పాల్యం రాచపాళెం, ఎస్‌బీఐ పురం నారాయణవనం, గేట్ పుత్తూరు బాలికల హైస్కూలు తదితర జడ్పీ హైస్కూలు స్కౌట్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

## సాలిడ్ వెస్టు మేనేజ్‌మెంట్‌పై శిక్షణ



వడమాలపేట, ఆగస్టు 20 ప్రభాతవార్త: సాలిడ్ వెస్టు మేనేజ్‌మెంట్‌పై శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. తిరుపతి జిల్లా వడమాలపేట మండలంలో ప్రభుత్వ ఆదేశాలు మేరకు మూడు రోజుల పాటు సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండో రోజు క్షేత్ర సందర్శనలో భాగంగా వడమాలపేట సాలిడ్ వెస్టు మేనేజ్‌మెంట్ షెడ్‌ను సందర్శించి వాటి యొక్క వివరాలు ఉపయోగాలు, ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో వడమాలపేట ఈవోపీఆర్‌డీ మాధురి, సుదర్శిని, శిక్షణ అధికారులు, ఎంపోటీలు, సర్పంచ్‌లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలపై శిక్షణ



విజయపురం, ఆగస్టు 20 ప్రభాతవార్త: పంచాయతీల్లో మౌలిక సదుపాయాలపై మంగళవారం ఈవోపీఆర్‌డీ సురేంద్రకుమార్ మంగళవారం సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ, గ్రామ సభలు, గ్రామ అభివృద్ధి పనులు వంటి అంశాలపై శిక్షణ కల్పించారు. కార్యక్రమంలో పలువురు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## విద్యా సామగ్రి పంపిణీ చేసిన టీడీపీ నాయకులు

విజయపురం, ఆగస్టు 20 ప్రభాతవార్త: మండలంలోని మహారాజపురంప్రాథమిక పాఠశాలలో మంగళవారం చిత్తూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్య నిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఒకటి నుంచి 5 తరగతి చదువుతున్న విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్, నోటు పుస్తకాలు వితరణగా అందించారు. కార్యక్రమంలోపాఠశాల విద్యా కమిటీ చైర్మన్ జయంతి, ప్రధానోపాధ్యాయులు సుష్మ, మాజీ ఎంపీటీసీ రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐని సన్మానిస్తున్న డీఎస్పీ



విజయపురం, ఆగస్టు 20 ప్రభాతవార్త: విజయపురంలో పని చేస్తున్న ఎస్ జయప్పను మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో నగరి డీఎస్పీ నరసింహమూర్తి పూలమాల వేసి, శాలువ కప్పి అభినందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకుని విధులు నిర్వహించడంపై ప్రశంసలు కురిపించారు. ఆయన బదిలీపై కర్నూలు జిల్లాకు వెళుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగరి రూరల్ సీఐ సుబ్బరామిరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ సర్పంచ్‌లు... చెత్త సంపద కేంద్రాలు సందర్శన



తిరుపతిరూరల్, ఆగస్టు20 ప్రభాతవార్త: చెత్త నుండి సంపదను ఎలా సృష్టిస్తారు. వాన పాముల తయారీ తదితర విషయాలను గ్రామ సర్పంచ్‌లకు తెలియపరుచుకుటకు మంగళవారం సర్పంచ్‌లు చెత్త సంపద కేంద్రాలను సందర్శించారు. చెత్త సంపద కేంద్రాలలో కంపోస్టు ఎరువు తయారీ, సహజ సిద్ధం భూమికి మేలు చేకూర్చే ఎర్రపాములను ఎలా పెంచాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. ఈనెల 19 నుండి 21వ తేదీ వరకు స్థానిక సర్పంచ్‌లకు పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వాహణ, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పరిశీలన కార్యక్రమంపై రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పేరూరు, పెరుమాళ్ళపల్లి చెత్త సంపద కేంద్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్స్ మాలతి, శశిరేఖ, ఎంపిడిఓ రమేష్ బాబు, ఇఓపిఆర్డీ గిరీధర్‌రెడ్డి పంచాయతీ కార్యధర్శులు పాల్గొన్నారు.

## ఎస్వి వైద్య కళాశాలలో పారా మెడికల్ కోర్సులకు ఇంటర్వ్యూలు

తిరుపతి హెల్త్, ఆగస్టు 20 ప్రభాతవార్త : గత నెలలో పారా మెడికల్ కోర్సులు కొరకు అప్లై చేసుకున్న వారికి ఈ నెల 30వ తేది ఉదయం 9.30 గంటలకు ఎస్వి వైద్య కళాశాల సమావేశ మందిరంలో కౌన్సిలింగ్ నిర్వహించబడునని ఎస్వి వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెలక్షన్ కమిషన్ ప్రచూరించిన రూల్ ఆఫ్ రిజర్వేషన్, ఇతర నిబంధన ప్రకారం సీట్లు భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యే దరఖాస్తుదారులందరూ ఎంపిక కమిటీ ముందు వారి ఒరిజినల్ సర్టిఫికేట్‌తో హాజరు కావాలని తెలిపారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు అనగా, పదవ తరగతి మార్కుల జాబితా, ఇంటర్మీడియట్ మార్కుల జాబితా, ఇంటర్ బదిలీ సర్టిఫికేట్, ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు స్టడీ, కండక్ట్ సర్టిఫికేట్స్, విద్యార్థి ఆధార్ కార్డు, (తాజా), పాస్‌పోర్ట్ సైజు రెండు కలర్ ఫోటోలు, పిహెచ్, విహెచ్ సర్టిఫికెట్ వికలాంగుల క్రింద రిజర్వేషన్ క్లెయిమ్ చేసే అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలు తీసుకుని రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి వైద్య కళాశాల పారామెడికల్ విభాగ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. మాధవి లత, నీలా రెడ్డి, ఎస్వి వైద్య కళాశాల పిఆర్‌ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

## స్విమ్స్ బయో ఇన్ఫర్మేటిక్స్ అసోసియేట్ 1కి ఇంటర్వ్యూ

తిరుపతి హెల్త్, ఆగస్టు 20 ప్రభాతవార్త : స్విమ్స్ బయోఇన్ఫర్మేటిక్స్ విభాగంలో ప్రాజెక్టు అసోసియేట్ 1 పోస్టు తాత్కలిక కాంట్రాక్టు పోస్టు కొరకు అభ్యర్ధులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ ఈ నెల 24వ తేది శనివారం ఉదయం 10 గంటలకు పాత డైరెక్టర్ ఆఫీస్, కమిటీ హాల్ స్విమ్స్ నందు నిర్వహిస్తున్నట్లు స్విమ్స్ రిజిస్ట్రార్ తెలిపారు. సంబంధిత తాత్కలిక ప్రాతిపదికన పోస్టు నియామకం మొదటిలో ఒక సంవత్సరం వరకు వుంటుందని ఉద్యోగి ప్రతిభను బట్టి పొడిగించబడుతుందన్నారు. ఎంఎస్‌సి బయో ఇన్ఫర్మేటిక్స్, బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, టీచింగ్, రీసెర్చ్ అనుభవం వఉండాలన్నారు. వయస్సు 35 సంవత్సరాలు వుండాలన్నారు. జీతం 25 వేలు, హెచ్‌ఆర్ఎ వుంటుందన్నారు. అభ్యర్థులు వారి వయస్సు, విద్యార్హత, బయోడేటా సర్టిఫికేట్‌ను సమర్పించాలని, అభ్యర్థులు తమ సొంత ఖర్చుతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. అభ్యర్థులు తమ సొంత ఖర్చుతో ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. మధ్యంతర విచారణలు స్వీకరించబడదన్నారు. ప్రాజెక్టు అసిస్టెంట్ యొక్క గరిష్ట వయోపరిమితి 24 ఆగస్టు 2024 నాటికి 35 సంవత్సరాలు ఉండాలన్నారు.

## హోమ్‌గార్డుల సంక్షేమానికి ఆర్థికచేయూత



తిరుపతి,ఆగస్ట్ 20ప్రభాతవార్త: పోలీసుశాఖకు చేదోడువాదోడుగా ఉంటున్న హోమ్‌గార్డులకు తిరుపతి జిల్లాలో అనారోగ్యంకారణంగా ఆర్థికసాయం అందించారు జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు. 7మంది హోమ్‌గార్డులకు వైద్యఖర్చుల కోసం 34,993 రూపాయలు నగదును మంజూరుచేసి స్వయంగా అందజేశారు. దీంతో హోమ్‌గార్డులు ఎస్పీ సేవానిరతిని అభినందించారు.

## నాలుగు మాడావీధుల్లో వన్‌వే ట్రాఫిక్ నిబంధనలు : సిఐ గోపి



శ్రీకాళహస్తి, ఆగస్టు 20 ప్రభాతవార్త : పోలీసులు ప్రజలకు స్నేహితులని శత్రువులు కాదని,ప్రజల రక్షణ ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా ఆంక్షల అమలులో కఠినంగా వ్యవహరిస్తాం తప్ప ఎవరి మీద పోలీసులకు వ్యతిరేక భావం లేదని వన్‌టౌన్ సిఐ గోపి వివరించారు. మంగళవారం నుంచి నాలుగు మాడ వీధుల్లో వన్‌వే ఆంక్షలను అమలు చేస్తున్నట్లు వివరించారు. వాహన చోదకులు నిబంధనలను ఉల్లఘించి పోలీసులతో ఘర్షణ పడవద్దన్నారు. వారం రోజుల పాటు అందరికి ట్రాఫిక్‌పై చైతన్యవంతుల్ని చేస్తామన్నారు.పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తికి ప్రతి రోజూ వస్తున్న వేలాది మంది భక్తులకు సౌకర్యంగా నడచుకోవాలన్నారు. ఈ నేపథ్యంలో తేరువీధి,పెండ్లిమండపం వద్ద సైన్ బోర్డులను ఏర్పాటు చేసామన్నారు.వారం రోజుల పాటు ఎవ్వరి మీద చర్యలు ఉండవన్నారు. ఆ తర్వాత జరిమానాలు భారీగా ఉంటాయని సిఐ వివరించారు.

## దోమల నివారణ దినోత్సవం



శ్రీకాళహస్తి,ఆగస్టు 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలోని సంతమైదానంలో మంగళవారం ప్రపంచదోమల నివారణ దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణంలోని సంతమైదానంలో అంగన్‌వాడి టీచర్లు, వైద్య, ఉపాధ్యాయులు విద్యార్థులతో ప్లకార్డులు చేతబట్టుకొని ఊరేగించారు.ఈ కార్యక్రమాలు వార్డు హెల్త్ సెక్రటరీ సుమతి, ఆశావర్కర్ మాలన్, ఉపాధ్యాయులు శశికళ,ప్రశాంతి, అంగన్‌వాడి టీచర్లు సుజాత తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షించాలంటే మొక్కలు నాటాలి



శ్రీకాళహస్తి రూరల్,ఆగస్టు 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి వద్ద వెలసిన ఇసిఎల్ కంపెనీ ఆవరణలో మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు పచ్చదనం పరిరక్షణలో భాగంగా చెట్లు నాటారు.అలాగే గోశాలను తనిఖీ చేసారు. ఇసిఎల్ 25వ వార్షికోత్స వం సందర్భంగా భారీ ఎత్తున కార్యక్రమాలు ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమాల్లో కలెక్టర్‌తో పాటు ఎండి సురేష్ ఖండెల్వాల్, సీనియర్ జీఎం దొరైరాజ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి:ఎంఎల్ఏ సంతాపం



శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం ఊరందూరు దళిత వాడకు చెందిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దళితవాడకు చెందిన యువకుడు సాయిచరణ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆ యువకుని భౌతికాయాన్ని మంగళవారం ఇంటికి చేర్చారు. విషయం తెలుసుకున్న శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి తన అనుచరులతో మృత దేహానికి నివాళులర్పించి వారి కుటుంబానికి సంతాపం తెలిపారు. ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

## గర్భస్థ పిండలింగ నిర్ధారణ చట్టాన్ని అమలు చేయాలి : ఆర్డీవో



.తొట్టంబేడు, ఆగస్టు 20 ప్రభాతవార్త : గర్భస్థపిండ లింగ నిర్ధారణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి అన్నారు. ఈసందర్భంగా మంగళ వారం ఆర్డీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవా లన్నారు. జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సమాజంలో స్త్రీ పురుషులు ఇద్దరు సమానమే అని, ఆడపిల్లల పట్ల వివక్షత ఉండరాదని తెలిపారు. గర్భస్థపిండ లింగ నిర్ధారణ చట్టాన్ని కఠినంగా అమలుచేయడం ద్వారా భ్రూణహత్యలను నివారించవచ్చని తెలిపారు. జిల్లాలో ప్రతి నెల అన్ని స్కానింగ్ కేంద్రాలను వైద్యులు తనిఖీలు నిర్వహించాలన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే 102,104 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్‌చేసి తెలియజేయవచ్చున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ మృదుల, డిఎస్పీ డెమె బాబునెహ్రూరెడ్డి, స్థానిక వైద్యులు డాక్టర్ బాలు, డాక్టర్ స్రవంతి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ప్రతిభావంతులకు చట్టాలపై అవగాహన

తొట్టంబేడు, ఆగస్టు 20 ప్రభాతవార్త : మండల లీగల్ సర్వీస్ ఆధ్వర్యంలో మండలంలోని బసవయ్యపాళెం గ్రామంలో ఉన్న ప్రత్యేక ప్రతిభావంతుల పాఠశాలలో ఉన్న ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థులకు పాఠశాలలోని ఉపాధ్యాయులు ఏవిధంగా వసతులు కల్పిస్తుందో న్యాయవాదులు పాఠశాలకు వెళ్ళి పరిశీలించారు. అనంతరం ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా శ్రీకాళహస్తి కోర్టు సముదాయంలో మండల లీగల్ సర్వీస్ ఆధ్వర్యంలో ఉచిత న్యాయసేవలను అందించే విధంగా కార్యాచరణ చేపట్టామన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు గుమ్మళ్ళ రాజేశ్వరరావు, మల్లికార్జునయ్య, జూనియర్‌న్యాయవాదులు దేవి, సింధు, ప్రత్యేక ప్రతిభావంతులు, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు ఉత్పత్తిదారుల సంస్థలు బలోపేతంకు చర్యలు : కలెక్టర్



చిత్తూరు, ఆగస్టు 20 ప్రభాతవార్త: జిల్లాలో రైతు ఉత్పత్తిదారుల సంస్థల బలోపేతంకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. జిల్లా సచివాలయంలోని సమావేశమందిరంలో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన రైతు ఉత్పత్తిదారుల సంస్థల జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు మెరుగైన, నాణ్యమైన వస్తువులను ఉత్పత్తి చేయడానికి వారిని ప్రోత్సహించడానికి మెరుగైన సాంకేతికత, క్రెడిట్, మార్కెటింగ్ సౌకర్యం తదితర సౌకర్యాల నిమిత్తం సన్న, చిన్నకారు రైతులు రైతు ఉత్పత్తిదారుల సంస్థల్లో భాగస్వాములు కావడం ద్వారా సత్ఫలితాలు పొందచ్చునన్నారు. ఆర్థిక బలం, మార్కెట్ అనుసంధానంను పెంపొందించడానికి రైతు ఉత్పత్తిదారుల సంస్థలు దోహదపడుతాయన్నారు. ప్రస్తుతం జిల్లాలో నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డు), వివిధ సంస్థల ఆధ్వర్యంలో 17 ఎఫ్‌పిఓలు పని చేస్తున్నాయన్నారు. ఇవి కేవలం ఎరువుల పంపిణీనే కాకుండా రైతులు పండించే ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించే అంశంపై త్వరలో శిక్షణా కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పలు పథకాలకు సంబంధించిన అవగాహనను ఎఫ్‌పిఓలకు ఈ శిక్షణా కార్యక్రమంలో అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎఫ్‌పిఓలు ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధించడానికి అవసరమైన బ్యాంకు సాయం నిమిత్తం చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. చిత్తూరు జిల్లాలో పాలు, కూరగాయలు, మామిడితో పాటు ఉద్యానవన పంటల సాగు వాటికి మార్కెటింగ్ సౌకర్యంపై ఎఫ్‌పిఓలు దృష్టి సారించడం ద్వారా రైతులకు మరింత లాభం చేకూరుతుందన్నారు. జిల్లాలో ప్రస్తుతం వున్న కోల్డ్ స్టోరేజీల్లో పండించిన పంట ఉత్పత్తులను స్టోర్ చేసేందుకు వినియోగించుకోవాలని కోరారు. ఎఫ్‌పిఓల పరిధిలో లైసెన్సులు మంజూరుకు సంబంధించి పెండింగ్ వుంచరాదని జిల్లా వ్యవసాయ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, నాబార్డ్ ఎజిఎం సునీల్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ప్రభాకర్, ఎఫ్‌పిఓలు తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి



కాణిపాకం, ఆగస్టు 20 ప్రభాతవార్త: రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జి.వాణీమోహన్ మంగళ వారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శ నార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ కె.వాణి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి వేదమండపంలో వేదాశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. వారి వెంట ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెంటెంట్‌లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విఘ్నేష్, కాణిపాకం ఎస్సై దరణీదర్ తదితరులు పాల్గొన్నారు.

## పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందజేత



రామకుప్పం, ఆగస్టు 20 ప్రభాతవార్త : మండలంలోని నారాయణపురం తాండా, కుదవగడ్డ, ననియాల, 89పెద్దూరు తదితర ప్రాంతాల్లో ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన రైతులకు మంగళవారం ప్రభుత్వం అటవీశాఖ ద్వారా 68వేల రూ.ల పంటనష్టపరిహారంను అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఏనుగుల దాడుల నిరోధానికి అటవీ సరిహద్దుల్లో ట్రెంచ్, సోలార్ కంచె నిర్మాణాలు చేపడ్తామన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో జయశంకర్, మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, కార్యదర్శి నరసింహులు, డిఆర్వో ధనుంజయుడు, తహశీల్దార్ బాబు, నేతలు మునస్వామి, ఆంజనేయరెడ్డి, రామూర్తి, రఫీ, గంట్లప్పగౌడు, మనోహర్, విజయ్‌కుమార్‌రెడ్డి, సుబ్రి, విశ్వనాథ్ పాల్గొన్నారు.

## 27న కాణిపాకంలో సమన్వయకమిటీ సమావేశం

కాణిపాకం, ఆగస్టు 20 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగనున్న 2024 వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించడానికి ఈనెల 27న అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయకమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆలయ ఈఓ కె.వాణికి సూచించారు. స్వామివారి వార్షిక బ్రహోత్మసవాల ఏర్పాట్లపై అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షా సపమావేశం నిర్వహించడానికి అనుమతి కోసం ఆలయ ఈఓ. కె.వాణి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్‌కు అర్చక వేదపండితుల ఆశీర్వచనంతో స్వామివారి తీర్థ, ప్రసాదాలను, చిత్రపటాన్ని అందించారు.ఈసందర్భంగా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లుపై ఇప్పటికే ఆలయ ఉభయదారుల సమావేశం నిర్వహించడం జరిగిందని, ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈమేరకు ఈనెల 27న కాణిపాకంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయకమిటీ సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ ఈఓ వాణికి సూచించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, అర్చకులు, వేపండితులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ



వెంకటగిరి, ఆగస్టు 20 ప్రభాతవార్త : పట్టణంలో క్రాస్ రోడ్ సమీపంలో దళిత బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ జరిగింది. నియోజకవర్గంలో చుట్టు పక్కల దళిత గిరిజన బహుజన ప్రజలు వేలాది మంది తప్పెట్ల తాలాలతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి అనంతరం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దళిత బహుజన ఐక్యవేదిక అధ్యక్షులు కలవలపూడి సహదేవయ్య సభా కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. సభా కార్యక్రమంలో దళిత మహిళ, దళిత కళాకారుల చేత సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సభ ముఖ్య అతిథులు ఏడిపిఎస్ అధ్యక్షులు ఇ. రామచంద్రయ్య, ధర్మయ్య, దళిత బహుజన ఐక్యవేదిక నాయకులు గోపాలు, డి. రామకృష్ణ, మంగళపురి సురేష్, దాసరి వంశీ, వంజాం ధనంజయ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఏలూరు రాజేంద్ర మాదిగ, వల్లిపాటి రవి, మణి, ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు గద్దల మునెయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ చేతరాస బాలయ్య, ఐదవ వార్డు కౌన్సిలర్ నారి శేఖర్, 14వ వార్డు కౌన్సిలర్ ఆర్ శంకరయ్య, టిడిపి నాయకులు కె. సుధాకర్, రామకృష్ణ, మల్లవరం బాబు, పల్లిపాటి వెంకటేష్, మచ్చలు వేణు, తదితరులు పాల్గొన్నారు.

## తడ బిసి కాలనీలో బంగారు, నగదు చోరీ

తడ, ఆగస్టు 20 ప్రభాతవార్త : తడ పంచాయతీ పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న బిసి కాలనీలో సోమవారం రాత్రి బంగారు నగలు, నగదు అపహరణకు గురైనట్లు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితుడు నొక్కు వెంచురత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాత్రి ఇంటి తాళాలు వేసుకొని మిద్దెపైన పడుకున్నామని, మంగళవారం ఉదయం తాము తాళాలు పగులగొట్టినట్లు గమనించి ఇంట్లో చూడగా కప్‌బోర్డులో ఉన్న తొమ్మిదిన్నర సవర్లు బంగారు నగలు, రూ.65 వేలు నగదు కనిపించలేదని ఫిర్యాదు చేశారు. ఇంటి మెయిన్ డోర్ తాళాలు గ్రిల్స్‌కు ఉన్న తాళాలు కూడా పగులగొట్టి దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. బాధితుడు శ్రీసిటీ సెజ్‌లోని డానియల్ కంపెనీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు చోరీకి గురైన నల్లపూసల దండ మూడు సవర్లు, డాలర్ చైన్ రెండు సవర్లు, మూడు జతల బంగారు కమ్మలు ఒకటిన్నర సవర, ఒక జత చెంపసరాలు, సాదా చైన్ ఒకసవర, రెండు బంగారు ఉంగరాలు ఒక సవర ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్ఐ నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అంగరంగ వైభవంగా ద్రౌపది అమ్మవారి కళ్యాణం



రామచంద్రాపురం, ఆగస్టు 20 ప్రభాతవార్త: సి.రామపురంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలలో భాగంగా మంగళవార ం ద్రౌపది అమ్మవారి కళ్యాణ మహోత్సవం జరిగింది. ఆలయ ప్రాంగణాన్ని పచ్చటి పందిళ్ళు అలంకరించారు. అనంతరం అమ్మవారికి సుగంధభరిత పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి పెళ్ళికూతురుగా ముస్తాబు చేశారు. ఆలయ పూజారి మార్కొండేయులు చేతుల మీదుగా అర్చకుల వేదమంత్రోఛ్చారణల నడుమ అమ్మవారి కళ్యాణ తంతు ముగించారు. కళ్యాణోత్సవానికి సి.రామాపురంకు చెందిన మాజీ వైస్ ఎంపిపి తేజోవతి నరశింహారెడ్డి, మిట్టూరు గ్రామస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు.

### వినాయక విగ్రహాల నిమజ్జనానికి

## చెరువుల వద్ద ఏర్పాట్లు చేయండి



తిరుపతిటౌన్, ఆగస్ట్ 20ప్రభాతవార్త: అన్ని వర్గాల వాళ్ళు ఎంతో వేడుకగా జరుపుకునే వినాయకచవితి పర్వదినం తరువాత విగ్రహాల నిమజ్జనానికి వినాయకసాగర్‌తోబాటు పరిసరాల్లోని చెరువుల్లో ఏర్పాట్లుచేయాలని వరసిద్దివినాయక మహోత్సవ కమిటీ కోరింది. ఈ మేరకు మంగళవారం తుడ విసి డాక్టర్ వెంకటనారాయణను వినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, గుండాల గోపీనాథరెడ్డి, ఆర్‌సి మునికృష్ణ, ఎస్వీఎం వెంకటేష్, కరాటే శ్రీనివాస్, నవీన్,సింగంశెట్టి సుబ్బరామయ్య, సుబ్రమణ్యంరెడ్డి, ప్రసాద్, రుద్రకోటి, సదాశివం, గోపి,వాసు, రెడ్డిబాబు తదితరులు కలిశారు. తిరుపతిలో దాదాపు వెయ్యికిపైగా విగ్రహాలు ఏర్పాటుజరుగుతుందని, విగ్రహాలను 3వరోజు సోమవారం నుండి 7వరోజు వరకు నిమజ్జనానికి వినాయకసాగర్‌ను అన్ని విధాలా అన్నిశాఖలు ఏర్పాట్లుచేస్తున్నాయన్నారు. అంతేగాక తిరుపతి పరిసరాల్లోని చెన్నాయగుంటచెరువు, దామినేడు చెరువు, గొల్లపల్లిచెరువు వద్ద వినాయక ప్రతిమలను నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లుచేయాలని, చెరువులను శుభ్రం చేసి, విద్యుత్‌లైట్లు,గజ ఈతగాళ్ళు సిద్దంచేయాలని కోరారు.

## పిల్లలపై మత్తుమందు చల్లి...
## ఆపై ఒంటిపై ఉన్న సొత్తులు అపహరణ!

శాంతిపురం, ఆగస్టు 20 ప్రభాతవార్త : మండలంలోని గుండిశెట్టిపల్లి ప్రాంతం వద్ద ఒ గుర్తు తెలియని వ్యక్తి ఆడుకుంటున్న పిల్లలపై మత్తు మందు చల్లి వారి ఒంటిపై ఉన్న బంగారు, వెండి నగలు తస్కరిస్తుండగా గ్రామస్తులు పట్టుకుని అతనికి దేహశుద్ధి చేశారు. అతనిది ఏ ఊరని అడిగితే ఒక్కోసారి ఒక్కో సమాధానం చెబుతున్నాడని దీంతో పోలీసులకు అప్పగించినట్లు గ్రామస్తులు తెలిపారు.

## సామాజిక కార్యక్రమాల్లో ఇసిఎల్ చొరవ
## అభినందనీయం : కలెక్టర్



శ్రీకాళహస్తి రూరల్,ఆగస్టు 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి వద్ద సుమారు 35 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఇసిఎల్ సామాజిక కార్యక్రమాలు అభినందనీయమని తిరుపతిజిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం సంస్థ 25వ వార్షికోత్సవం సందర్భంగా పరిశ్రమ ఆవరణలో సంబరాలను ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాలు ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సురేష్ కండేవాల్ అధ్యక్షతన జరిగాయి. ముఖ్య అతిదిగా వచ్చిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కంపెనీ సి ఎస్ ఆర్ నిధులతో చేపట్టిన సామాజిక అభివృద్ధి కార్యక్రమాల ఫోటో ఎగ్జిబీషన్‌ను తిలకించారు. ఈ సందర్భంగా వివిధ సేవల్లో తమ ప్రతిభా పాటవాలను కనబరచిన యువతీ యువకులకు ప్రశంసాపత్రాలతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కంపెనీ ఏర్పాటు చేసిన కంప్యూటర్ ట్రైనింగ్ కార్యక్రమాల్లో తమ ప్రతిభను చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేసారు. అలాగే ఫ్యాషన్ డిజైన్,టైలరింగ్‌లో ప్రతిభ చూపిన గ్రామీణ మహిళలకు బహుమతులను అందజేసారు. ఈ సందర్భంగా కండేవాల మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందిస్తే కార్బన్ ఉద్గారాలు తగ్గించి పచ్చదనం పెంపు చేస్తామన్నారు.

## డిప్యూటీ సొలిసిటర్‌గా...
## శ్రీకాళహస్తి యువకునికి అవకాశం



శ్రీకాళహస్తి,ఆగస్టు 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తికి చెందిన వివిఎంపల్లికి చెందిన యువకుడు పసల పొన్నారావుకు రాష్ట్ర సమోన్నత న్యాయ స్థానంలో అవకాశం లభించింది.శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రమే కాకుండా విద్యావంతులు,కళాకారులకు నిలయంగా ఉంది. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన ఓ యువతి జిల్లా కలెక్టర్‌గా ఉన్నారు. అలాగే మరో అవకాశం పట్టణంలోని విఎంపల్లికి చెందిన ఓ సామాన్య కుటుంబంలో జన్మించి దశల వారిగా ఎదిగిన యువకునికి రాష్ట్ర హైకోర్టులో డెప్యూటీ సొలిసిటర్ జనరల్‌గా అవకాశం వచ్చింది. ఓ సామాన్య కుటుంబంలో జన్మించి తల్లిదండ్రుల కష్టాన్ని దృష్టిలో పెట్టుకొని ఎదిగిన పసల పొన్నారావు అనుకువగా వ్యవహరిస్తూ పదోన్నతులను సాధించారు.వివిఎంపల్లికి చెందిన పసల మహాలక్ష్మమ్మ, మోహన్‌రావుల కుమారుడు పొన్నారావు.ఆయన మూడేళ్ళ పాటు రాష్ట్ర హైకోర్టులో కేంద్రం తరఫున కేసులకు సంబంధించిన వాదనలు వినిపిస్తారు. అయితే రాష్ట్ర హైకోర్టు చరిత్రలో ఓ ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి డిఎస్‌జిగా నియమితులు కావటం ఇదే ప్రప్రథమం. ఆయన నియామకం పట్ల శ్రీకాళహస్తికి చెందిన పలువురు అభినందించారు.

## రంగస్థలి అవార్డుకు ఎన్నికైన 'వీక్ష ది' స్కూల్ విద్యార్థిని నైషిక




తిరుపతిరూరల్, ఆగస్టు20 ప్రభాతవార్త: వీక్ష ది స్కూల్ విద్యార్థిని వై.నైషిక రంగస్థలి అవార్డుకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఆర్.కె.విమల తెలిపారు. స్థానిక బైరాగిపట్టెడలో వున్న వీక్ష ది స్కూల్ విద్యార్థినికి శ్రీకృష్ణదేవరాయ కళా దర్బార్ ఆధ్వర్యంలో రాయలసీమ రంగస్థలి అవార్డు-2024కు ఎంపిక కావడం ఆనందంగా ఉందని తెలిపారు. అవార్డుకు ఎంపికైన నైషికను పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు. పాఠశాలలో విద్యతో పాటు సాంస్కృతిక రంగంలో కూడా స్కూల్ విద్యార్థులు ఎంపిక కావడం ఆనందించదగ్గ విషయమని, చిన్ననాటి నుంచి విద్యతో పాటు నైతిక విలువలు నేర్పించబడునని తెలిపారు. సెప్టెంబర్ నెలలో జరిగే 'బ్రహ్మమొక్కటే-పరబ్రహ్మమొక్కటే' బుక్ ఆఫ్ రికార్డ్స్‌లకు కూడా వీక్ష ది స్కూల్ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. అలాగే అదేనెలలో జరిగే జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు కూడా ఆర్.కె. గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.కె.అబాకస్ చైర్మెన్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి, అన్నమయ్య డాన్స్ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీరామ్‌బాబు తదితరులు పాల్గొగన్నారు.

## ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యం : జిల్లా ఎస్పీ



తిరుపతి హెల్త్, ఆగస్టు 20 ప్రభాతవార్త : ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో శాంతి భద్రతలు కాపాడడం ప్రథమ కర్తవ్యమని జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు అన్నారు. మంగళవారం ప్రెస్ క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ తిరుపతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన ప్రపంచ ఫోటో గ్రఫీ వేడుకలు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి జిల్లా ఎస్పి సుబ్బరాయుడు ముందుగా ఫోటో ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకించి పలువురు ఫోటో జర్నలిస్టులను అభినందించారు. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో నిత్యం ప్రముఖుల రాక పోకలు ఉంటాయని, వారందరిని ఫోటోలు తీయడం ఫోటో జర్నలిస్టులకు ఒత్తిడితో కూడుకున్న పని అన్నారు. అలాగే నగరంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగిన తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తిరుపతి జిల్లాలో ఫ్రెండ్లి పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అనంతరం ఫోటో జర్నలిస్టులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. గిరిబాబు, జిల్లా అధ్యక్షుడు కె. రాధాకృష్ణ, కార్యదర్శి ఆర్. లావణ్య కుమార్, కోశాధికారి శివయ్య, ఎలక్ట్రానిక్ మీడియా మాజీ జిల్లా అధ్యక్షుడు ఆర్. మురళీకృష్ణ, ఫోటో జర్నలిస్టులు సిహెచ్ కేవీ పూర్ణచంద్ర కుమార్, గోపాలకృష్ణ, భాస్కర్, ప్రసాద్, మోహన్ కృష్ణ, శ్రీనివాస్, రాధాకృష్ణ, పీటర్ కుమార్, ప్రవీణ్, రెడ్డెప్ప, సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## చిరుధాన్యాలతో ఆరోగ్యవంతులుగా జీవించాలి



తిరుపతి రవాణా , ఆగస్టు 20, ప్రభాతవార్త : వ్యవసాయ ఉత్పతు_లు చిరుధాన్యాలు వంటి ఆహారాలు తింటూ ఆరోగ్యాన్ని పరిరక్షించు కుంటూ ఆయుష్షు వంతులుగా జీవించాలని టాటా ట్రస్ట్ ప్రతినిధి హేమంత్ తెలిపారు. రాస్ మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో టాటా ట్రస్ట్ వారి సహకారంతో మంగళవారం నెహ్రూ నగర్ క్లస్టర్‌లోని రాస్ కార్యాలయంలో ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో కలుషితమైన ఆహారం అలవరచుకుని అనారోగ్యాల భారిన పడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. చిరుధాన్యాల తినడం ద్వారా మనలో శారీర ఎదుగుదల దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం పొందేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. రాస్ అధికారి డి. నాగరాజు మాట్లాడుతూ కోవిడ్ 19 నేర్పిన పాఠాల నుంచి ప్రజల జీవన విధానాన్ని ఆరోగ్య విధానంలో తగు జాగ్రత్తలు తీసుకుని వ్యాధి నిరోధక శక్తినిచ్చే సమతుల్య ఆహారం తీసుకోవాలని తెలిపారు. అనంతరం సుమారు 150 మందికి ఉచితంగా బీపీ, షుగర్, హైపటైటీస్ పరీక్షలు నిర్వహించారు. రాస్ సిబ్బంది పద్మావతి, మంజునాథ్, మాధవి, భాగ్యలక్ష్మి, క్లస్టర్ లీడర్లు సుబ్బులమ్మ, రత్నమ్మ, కావేరమ్మ మహిళలు పాల్గొన్నారు.

## బీఈడీ రికార్డ్స్ ఫీజు తగ్గించాలి

### మంత్రి నారా లోకేష్‌కు ఎన్ఎస్‌యుఐ వినతి



తిరుపతి రవాణా , ఆగస్టు 20 ప్రభాతవార్త : బీఈడి విద్యార్థులకు రికార్డు ఫీజు తగ్గించాలని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెన్నే మల్లికార్జున విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం సిఎం క్యాంపు కార్యాలయంలో విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెన్నే మల్లికార్జున్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో ఎస్వి యూనివర్శిటీ పరిధిలోని బిఈడి విద్యార్థులకు ప్రతి రికార్డుకు 2500 ఫీజులు పెంచడం వలన తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. విద్యార్థులు అనారోగ్యం కారణాల వల్ల సకాలంలో రికార్డులు సమర్పించలేకపోతున్నారన్నారు. 2014 - 19 వరకు ఒక్క సెమిస్టర్‌కు 2500 మాత్రమే ఫీజు చెల్లించేవారు కానీ వైసిపి ప్రభుత్వంలో 2022లో వచ్చిన ఆర్డర్ ప్రకారం ప్రతి రికార్డుకు 2500 రూపాయిలు చెల్లించవల్సి వస్తుందన్నారు. బీఈడీలో ఒక్క సెమిస్టర్‌కు 10 నుండి 15 రికార్డుల వరకు ఉంటాయి. ఇలా ఒక సెమిస్టర్‌కు దాదాపు 30 వేల రూపాయిలకు చెల్లించాల్సి వస్తుందన్నారు. దీని వలన బీఈడీలో ఉన్న విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల మోగా డిఎస్సికి దూరం అవుతున్నారని, ఇందులో చాలా చాలా మంది ఎస్సి, ఎస్టీ, బీసీ మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ నిరుపేద విద్యార్థుల దృష్టిలో ఉంచుకొని పాత పద్ధతిలోనే ఒక సెమిస్టర్‌కు 2500 ఫీజు ఉండేలా విద్యార్థులకు న్యాయం చేయాలని నారా లోకేష్‌కు వివరించారు. కొంత మంది వ్యక్తులు ఉపాధ్యాయ బీఈడి సంస్థను సర్వనాశనం చేశారని, ఆ వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీటిపై సానుకూలంగా స్పందించిన మంత్రి నారా లోకేష్ బీఈడీ విద్యార్థులు సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## హడలేత్తిస్తున గ్రామ సింహాలు!

**-ఒకే నెలలో 70 మందిని కరచిన కుక్కలు**

**- ఇల్లు విడిచి రావాలంటే భయపడుతున్న ప్రజలు**

**- ఇదేమి పట్టించుకొని పంచాయతీ అధికారులు**

పాలసముద్రం, ఆగస్టు 20 ప్రభాతవార్త: పాలసముద్రం మండలంలో కుక్కవ బెడద ఎక్కువైంది. ఒక నెల రోజుల్లో వీధి కుక్కలఉ 70 మందికి కరిచాయంటే ఆ మండలంలో కుక్కల బెడద ఎంత మేరకు వుందో అదరికి అర్థమవుతుంది. కుక్కల బెడదను కట్టడి చేయాల్సిన పంచాయతీ అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో మండల పరిధిలో రోజు రోజుకు కుక్కల గుంపులు ఎక్కువ అవుతున్నాయి. మండలంలోని ప్రజలు పారిశుధ్య లోపం వుండి జ్వరాలు వచ్చినా తట్టుకుని వుండిపోతామని ఈ కుక్కల బెడద నుండి తమను రక్షించాలని ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారులకు బ్రతిమాలుకొంటున్నప్పటికీ వారు పట్టించుకోవడం లేదు. మండలంలోని ప్రతి గ్రామంలో వీధి కుక్కలు ఎక్కువగా వుంటున్నాయి. ప్రతి వీధిలోను కుక్కలు ఎక్కువగా వుండటంతో నడచి వెళ్ళేవారు. సైకిళ్ళపై వెళ్ళేవారు, మోటర్ బైక్స్‌పై వెళ్ళేవారిని కుక్కలు వెంబడించి కరుస్తున్నాయి. మరోవైపు కుక్కలు మేకలు, లేగదూడలు, కోళ్ళను తినివేస్తున్నాయి. కుక్కల భయంతో పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులు బెంబేలెత్తుతున్నారు. కృష్ణజిమ్మాపురం పంచాయతీ కొండం గ్రామానికి చెందిన పాలితయ్య(36)ను కుక్క కరిచింది. ఆయన వైద్యం కోసం సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వెళ్ళాడు. అయితే మండల పరిధిలో ఈ నెలలో ఇప్పటి వరకు 70 మంది వ్యక్తులను కుక్కలు కరచినట్లు పక్కా సమాచారం. ఇకనైనా పంచాయతీ అధికారులు మండల పరిధిలో స్వైర విహారం చేస్తున్న వీధి కుక్కలను పట్టివేతకు చర్యలు తీసుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తారని ఆశిద్దాం.

## సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి..డిఎస్పీ



తొట్టంబేడు, ఆగస్టు 20 ప్రభాతవార్త : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని డిఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం డిఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని నేడు కొందరు సులభంగా నగదు సంపాదించడం కోసం అలవాటు పడి సైబర్‌నేరగాళ్ళ చేతుల్లో మోసపోతున్నారన్నారు. వీరు అనేక విధాలుగా ప్రజలను ప్రలోబపెట్టే విధంగా పోన్లు చేసి ఓడిపి చెప్పాలని కోరితే చెప్పరాదని హెచ్చరించారు. అపరిచితుల నుంచి ఎస్ఎంఎస్‌లు, ఈమెయిల్, వాట్సాప్‌ల ద్వారా వచ్చే బ్లూకలర్ లింక్స్‌ను క్లిక్ చేస్తే మొబైల్‌లోని డేటా మొత్తం సైబర్ నేరగాళ్ళ చేతుల్లోకి వెళ్ళిపోతుందన్నారు. పోలీసులు సైతం పోన్ చేసి వివరాలు అడిగితే సంబందిత పోలీస్‌స్టేషన్‌కు వద్దకు వెళ్ళి తాము తమ వివరాలు తెలియజేస్తామని తెలియజేయాలని కోరారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని వారికి తగిన విధమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

## హెచ్‌ఐవిపై విద్యార్థులకు అవగాహన

తొట్టంబేడు, ఆగస్టు 20 ప్రభాతవార్త : రాష్ట్ర హెచ్‌ఐవి నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి స్టెప్స్ సంస్థ ఆధ్వర్యంలో 'మీకు తెలుసా'? అవగాహన కార్యక్రమాన్ని తొట్టంబేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో స్టెప్స్ సంస్థ మేనేజర్ భాస్కర్ మాట్లాడుతూ హెచ్‌ఐవి/ఎయిడ్స్ వస్తుంది, రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సంబంధంశెట్టి, తొట్టంబేడు ఆరోగ్య కేంద్రం ఎఎన్ఎం వరలక్ష్మి, ఆశావర్కర్ భారతీ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో ఎంపి డాక్టర్ గురుమూర్తి



తిరుమల,ఆగస్ట్ 20ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి ఆకాంక్షించారు. మంగళవారం ఉదయం ఆయన వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

# డాక్టర్స్ పోరాటానికి కదిలిన విద్యార్థి లోకం

**సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావాలి**
**-మహిళలకు, వైద్య సిబ్బందికి పటిష్టమైన భద్రత కల్పించాలి- ఎస్ఎఫ్ఐ, ఐద్వా**




తిరుపతి హెల్త్, ఆగస్టు 20 ప్రభాతవార్త : జూనియర్ డాక్టర్ పై జరిగిన అత్యాచారంకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ, ఐద్వా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి 600 మంది విద్యార్థులతో కళ్ళకు రిబ్బన్స్ కట్టుకొని న్యాయం కోసం మేము సైతం అంటూ కళాశాల నుంచి అన్నారావ్ సర్కిల్, ఇస్కాన్ టెంపుల్, రుయా హాస్పిటల్‌లో జూనియర్ డాక్టర్స్ పోరాటానికి మద్దత్తు పలికారు. దేశంలో గత 10 రోజుల నుంచి పెద్ద ఎత్తున మహిళల రక్షణ కోసం విద్యార్థులు, యువత రోడ్లపై వచ్చి నినాదిస్తున్నారని భారత విద్యార్థి ఫెడరేషన్ కూడా అన్ని విశ్వవిద్యాలయాలలో, కళాశాలలో పెద్ద ఎత్తున ఈ ఉద్యమంలో భాగస్వాములుగా విద్యార్థులను చేస్తున్నామని చెప్పారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ మెడికల్ విద్యార్థుల పోరాటానికి ఎస్ఎఫ్ఐ సంపూర్ణ మద్దత్తు ఉంటుందన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి సాయి లక్ష్మి మాట్లాడుతూ అత్యాచారాలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. కానీ శిక్షలు పెరగడం లేదని చట్టాలు, చుట్టాలుగా మార్చుకొని వచ్చాలవిడిగా మద్యం, డ్రగ్స్, పోర్న్ సైట్స్ మత్తులో యువత అసంఘటిత కార్యకలాపాలుకు పాల్పడుతున్నారని తక్షణమే మద్యం, డ్రగ్స్‌ను బ్యాన్ చేయాలని విద్యార్థి, యువత జీవితాలు కాపాడాలని కోరారు. డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయచంద్ర మాట్లాడుతూ యువత దేశాన్ని నిర్మించే శక్తులుగా కాకుండా నేడు చెడు వ్యసానాలకు గురి అయి ఇలా అఘాత్యాలకి పాల్పడటం దుర్మార్గమైన అంశం అని, అత్యాచారంకు పాల్పడిన నిందుతులను ఎలాంటి పక్షపాతం లేకుండా శిక్షించాలని, కేంద్ర, రాష్ట్రల నిర్లక్ష్యం వీడి తక్షణమే పార్లమెంట్‌లో మహిళ భద్రత, వైద్య సిబ్బంది భద్రత పై చర్చ జరిపి పటిష్టమైన భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు జయంతి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు తేజ, జిల్లా నాయకులు రవీంద్ర, గణేష్, నాయకులు హర్షద్, లోకేష్, రవి, హరీష్, తదితరులు పాల్గొన్నారు.